




ఆర్ఎన్ఐ/2009/ 28733

స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 243 తిరుపతి తేది : గురువారం 07 ఆగస్టు 2025 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISTRICTS




## ఢిల్లీలో నూతన పరిపాలనా సౌధం..

- 'కర్తవ్య భవన్'ను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ఏటా అద్దెల రూపంలో చెల్లిస్తున్న రూ. 1,500 కోట్లు ఆదా అవుతుందని వెల్లడి
- ఒకేచోటకు ఏడు కీలక మంత్రిత్వ శాఖల తరలింపుతో సమన్వయం సులభతరం
- అత్యాధునిక భద్రత, పర్యావరణ హిత ఫీచర్లతో భవనం నిర్మాణం

**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, ఆగస్టు 06**

దేశ రాజధాని ఢిల్లీలో పరిపాలనా సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. చెల్లాచెదురుగా ఉన్న మంత్రిత్వ శాఖలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ, సెంట్రల్ విస్టా పునరాభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన 'కర్తవ్య భవన్-03'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త సమీకృత పరిపాలనా సముదాయం వల్ల ప్రభుత్వానికి ఏటా - మిగతా 2లో..

# 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం..

- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- ఐటీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఆకర్షణకు 'లిఫ్ట్' పాలసీకి గ్రీన్ సిగ్నల్
- కొత్త బార్ పాలసీ 2025-28కి ఆమోదం.. లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు
- మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి.. బహిరంగ మద్యపానం నివారణే లక్ష్యం
- చేనేత, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పరిమితి పెంపు.. పలు సంక్షేమ పథకాలకు ఆమోదం
- ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏపీటీడీసీ హోటళ్ల అభివృద్ధి.. 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయం



**అమరావతి-ఆంధ్రనాడు, ఆగస్టు 06**

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్దేశించే పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. ఎన్నికల హామీల అమలుతో పాటు, పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా మంత్రివర్గం అనేక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం, ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'లిఫ్ట్' పాలసీ అత్యంత ముఖ్యమైనవిగా నిలిచాయి. ఈ వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**మహిళల కోసం 'స్త్రీ శక్తి'.. ఇక బస్సు ప్రయాణం ఉచితం**

రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం - మిగతా 2లో..

### ఆ 65 లక్షల మంది

## ఓటర్ల వివరాలివ్వండి

**న్యూఢిల్లీ - -ఆంధ్రనాడు, ఆగస్టు 06**

బీహార్ ఓటర్ల ముసాయిదా జాబితా నుంచి తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను, తొలగించడానికి గల కారణాలను అందజేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. త్వరలో ఎన్నికలు జరగనున్న బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో చేపట్టిన ప్రక్రియలో భాగంగా ఆగస్టు 1న ముసాయిదా జాబితాను ఈసీ ప్రచురించింది. ఈ వివరాలన్నింటినీ 9వ తేదీకల్లా అందజేయాలని



జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ ఈసీని ఆదేశించింది

- మిగతా 2లో..

## చైనా పర్యటనకు ప్రధాని మోదీ



- షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సులో పాల్గొనేందుకు చైనా పర్యటన
- ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో యాంజిన్‌లో శిఖరాగ్ర సమావేశం
- సరిహద్దు గస్తీపై ఒప్పందం తర్వాత మెరుగైన సంబంధాలు
- ఇటీవలే చైనాలో పర్యటించిన రాజ్‌నాథ్, జైశంకర్, అజిత్ దోభాల్

2 లో

## ఎస్ఐఆర్‌పై చర్చించాలి

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల డిమాండ్
- 13వ రోజూ సమాధానమివ్వని కేంద్రం



**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, ఆగస్టు 06**

బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై చర్చించా లనే డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన బుధవారానికి 13వ రోజుకు చేరుకున్నది. లోక్‌సభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్లకార్డు పట్టుకుని నినాదాల హోరె త్తించారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే సభను స్పీకర్ ఓం బిర్లా మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో - మిగతా 2లో..

## అదానీపై అమెరికాలో దర్యాప్తు

### - అందుకే ట్రంప్ బెదిరింపులకు మోడీ సైలెంట్: రాహుల్

**న్యూఢిల్లీ -ఆంధ్రనాడు, ఆగస్టు 06**



పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికా దర్యాప్తు కారణంగా డోనాల్డ్ ట్రంప్ నుంచి పదే పదే బెదిరింపులు వచ్చినప్పటికీ ప్రధాని మోడీ ఎదుర్కోలేకపోతున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ తమకు మంచి వాణిజ్య భాగస్వామి కాదని, రాబోయే 24 గంటల్లో సుంకాలను చాలా గణనీయంగా పెంచుతానని ట్రంప్ ప్రక టించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. "భారత్ ప్రజలారా, దయచేసి అర్థం చేసు కోండి. అధ్యక్షుడు ట్రంప్ పదే పదే బెదిరింపులు చేసినప్పటికీ ప్రధాని మోడీ మౌనం గా ఉండడానికి కారణం అదా నీపై కొనసాగుతున్న అమెరికా దర్యాప్తు. మోడీ, అంబానీ- అదానీ, రష్యన్ చమురు ఒప్పం దాల మధ్య ఆర్థిక సంబంధాలను బహిర్గతమవుతాయి. మోడీ చేతులు కట్టేశారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు. అయితే రాహుల్ పోస్ట్‌పై ప్రభుత్వం లేదా అదానీ గ్రూప్ నుంచి స్పందన రాలేదు.

### 20 లక్షల ఉద్యోగాల కల్పనకు

# కష్టపడి పనిచేస్తున్నాం

- 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సదస్సు
- విజయవాడ నోవాటెల్ హోటల్ లో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్


**అమరావతి-ఆంధ్రనాడు, ఆగస్టు 06**

మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హెూటల్ లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర, పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని వెల్లడించారు.




**దేశంలో ఏ పార్టీకి ఈ రికార్డు లేదు!**

దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94 శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను - మిగతా 2లో..




## 'లూలూ'కు చౌకగా భూమిపై ప్రభుత్వానికి నోటీసులు

**అమరావతి -ఆంధ్రనాడు, ఆగస్టు 06**

విశాఖపట్నం, విజయవాడలో 'లూ లూ'కు ప్రభుత్వం భూ కేటాయింపు లను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, లూలూ యాజమాన్యానికి నోటీసులిచ్చింది. విచారణను అక్టోబరు 8కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. విశాఖపట్నంలో 13.5 ఎకరాలను, విజయవాడలో 4.15 ఎకరాల భూమిని నామమాత్రపు ధరకు లూలూ మాల్ మేనేజ్‌మెంట్‌కు ఇవ్వడాన్ని విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, విజయవాడకు చెందిన న్యాయవాది సిహెచ్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా వేసిన పిల్స్‌ను హైకోర్టు విచారించింది. బిడ్స్ లేకుండానే భూమి ఇచ్చారని, భూ కేటాయింపు జిఓను రద్దు చేయాలని పిటిషనర్ల లాయర్లు కోరారు. నూతన పారిశ్రామిక విధానంలో భాగంగానే లూలూ మాల్‌కు భూ కేటాయింపు జరిగిందని ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ చెప్పారు. - మిగతా 2లో..

# ఢిల్లీలో నూతన పరిపాలనా సౌధం..

(మొదటిపేజీ తరువాయి)

అద్దెల రూపంలో ఖర్చయ్యే రూ. 1,500 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందని స్పష్టం చేశారు.

**అద్దె భవనాలకు స్వస్తి.. పెరగనున్న సామర్థ్యం**

ప్రస్తుతం ఢిల్లీలో పలు కీలక మంత్రిత్వ శాఖలు దశాబ్దాల క్రితం నిర్మించిన శాస్త్రి భవన్, కృషి భవన్, ఉద్యోగ్ భవన్ వంటి పాత భవనాల్లో, మరికొన్ని అద్దె భవనాల్లో పనిచేస్తున్నాయని ప్రధా ని గుర్తుచేశారు. "వివిధ కార్యాలయాలు చెల్లాచెదురుగా ఉండటంతో దాదాపు 8,000 నుంచి 10,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు పనుల నిమిత్తం రోజూ ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ట్రాఫిక్ రద్దీకి, ఇంధన ఖర్చులకు కారణమవడమే కాకుండా, పని సామర్థ్యాన్ని కూడా తగ్గి స్తోంది. కర్తవ్య భవన్ నిర్మాణంతో ఈ సమస్యకు పరిష్కారం లభించింది" అని ప్రధాని వివరిం చారు. ఈ కొత్త భవనం ప్రజానుకూలం, పర్యావరణ అనుకూలం అని ఆయన అభివర్ణించారు.

**ఒకేచోట ఏడు కీలక మంత్రిత్వ శాఖలు**

కర్తవ్య పథ్‌లో నిర్మించిన ఈ భవనంతో పాలనలో వేగం, మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. సుమారు 1.5 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో, రెండు బేస్‌మెంట్లు, ఏడు అంతస్తులతో (గ్రౌండ్ ౦ 6) ఈ భవనాన్ని నిర్మించారు. ఇందులో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి, ఎంఎస్ఎంఈ, సిబ్బంది–శిక్షణ పెట్రోలి యం–సహజ వాయువు, ప్రధాన శాస్త్రీయ సలహాదారు కార్యాలయాలు కొలువుదీరనున్నాయి.

**అత్యాధునిక, పర్యావరణ హిత నిర్మాణం**

కర్తవ్య భవన్ నిర్మాణంలో అత్యాధునిక టెక్నాలజీతో పాటు పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేశారు. సాధారణ భవనాలతో పోలిస్తే 30 శాతం తక్కువ విద్యుత్‌ను వినియోగించేలా డిజైన్ చేశారు. భవనం లోపల ఉష్ణోగ్రతను నియంత్రించి, బయటి శబ్దాలను తగ్గించేందుకు డబుల్ గ్లేజ్డ్ ఫ్యాసేడ్ విండోలను అమర్చారు. ఆక్యుపెన్సీ సెన్సర్లతో కూడిన ఎల్ఈడీ లైటింగ్, విద్యుత్ ఆదా చేసే స్మార్ట్ లిఫ్టులు ఏర్పాటు చేశారు. భవనం పైకప్పుపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఏటా 5.34 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. జీరో డిశ్చార్జ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని అనుసరిస్తున్నారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి తిరిగి వినియో గిస్తారు. నిర్మాణంలో కూడా రీసైకిల్ చేసిన వ్యర్థాలను వాడారు. ఐడీ కార్డు ఆధారిత ప్రవేశాలు, ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్ నిఘా, సెంట్రలైజ్డ్ కమాండ్ సిస్టమ్‌తో భద్రతను కట్టుదిట్టం చేశారు.

**ఇవి పాలనా దేవాలయాలు: ప్రధాని మోదీ**

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఆగస్టు నెల విప్లవాల మాసమని అన్నారు. "గత కొన్నేళ్లుగా రాజధానిలో నిర్మించిన నూతన పార్లమెంట్ భవనం, భారత్ మండపం, జాతీయ యుద్ధ స్మారకం, యశోభూమి కన్వెన్షన్ సెంటర్ల సరసన ఇప్పుడు కర్తవ్య భవన్ కూడా చేరింది. ఇవి సాధారణ కట్టడాలు కావు, వికసిత భారత్ భవిష్యత్తును తీర్చిదిద్దే పాలనా దేవాలయాలు" అని ఆయన పేర్కొన్నారు. 21వ శతాబ్దపు భారతదేశానికి పాతకాలపు పనివిధానాలు సరిపోవని, అందుకే ఈ పరివర్తన అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## ఆ 65 లక్షల మంది
# ఓటర్ల వివరాలివ్వండి

(మొదటిపేజీ తరువాయి)

దీనిపై విచారణను 12వ తేదీకి వాయిదా వేసింది. బీహార్‌లో ఎస్ఐఆర్‌ను సవాలు చేస్తూ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)అనే ఎన్‌జిఓ గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. తాజాగా ముసాయిదా ఓటర్ల జాబితాలో తొలగించిన వారి వివరాలు వెల్లడించాలంటూ మరో పిటిషన్ దాఖలు చేసింది. దానిపై బుధవారం విచారణ జరిపిన సుప్రీం పై ఆదేశాలు జారీ చేసింది. ఓటర్ల పేర్లు తొలగించడానికి వివిధ రకాల కారణాలు ఉండొచ్చునని, చనిపోవడం లేదా రాష్ట్రం నుంచి శాశ్వతంగా బయటకు వెళ్ళిపోవడం, రెండు చోట్ల పేర్లు వుండడం, ఎక్కడున్నారో తెలియకపోవడంవంటి పలు కారణాలు వుండొచ్చు నని ఆ పిటిషన్ పేర్కొంది. అయితే, తొలగించిన ప్రతి పేరుకు గల కారణాలను విడివిడిగా చూపలేదు. నియోజకవర్గాల వారీగా లేదా బూత్‌ల వారీగా ఏ విధంగానైనా ముసాయిదాలో చూపలేదని పేర్కొంది. నిర్దిష్ట కారణాలతో తొలగించిన ఓటర్ల వివరాలను అసెంబ్లీ, బూత్‌ల వారీ జాబితా వారీగా అందజేయాలని కోరింది. తొలగించిన పేర్ల జాబితాను కొన్ని రాజకీయ పార్టీలకు అందజేశారని, అయితే వాటివల్ల ఉపయోగం లేకుండా పోయిందని పిటిషనర్ల తరపున ప్రశాంత్ భూషణ్ పేర్కొన్నారు. ఇలాంటి తొలగింపులకు గల కారణాలు ఇవ్వనందున వాటిని క్రాస్ చెక్ చేసుకోవడానికి కూడా వీల్లేకుండా పోయిందని అన్నారు. 'బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) సిఫారసు చేయలేదు' అని గుర్తించబడిన ఎన్యూమరేషన్ ఫారాల ఓటర్ల వివరాలను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా, బూత్‌ల వారీగా ప్రచురించాల్సిందిగా పిటిషనర్లు కోరారు. దర్భంగా, కైమూర్ జిల్లాలకు సంబంధించిన సమాచారం చూసినట్లైతే బీఎల్ఓ సిఫారసు చేయలేదు అని రాసిన ఎన్యూమరేషన్ ఫారాలను పెద్ద సంఖ్యలో అప్‌లోడ్ చేశారని పిటిషనర్ల తరపున ప్రశాంత్ భూషణ్ తెలిపారు. దర్భంగా, కైమూర్ జిల్లాల్లో వరుసగా 10.6, 12.6శాతం మందికి ఇలా బీఎల్ఓ సిఫారసు చేయలేదనే ముద్ర వేసి వుందని పేర్కొన్నారు.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు
# కష్టపడి పనిచేస్తున్నాం

క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం. ప్రతి వంద కిలోమీటర్లకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

**సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభిస్తాం**

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి.

**గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా యువతకు విస్తృత అవకాశాలు**

గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్ లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40 వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది.

# 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం..

(మొదటిపేజీ తరువాయి)

శుభవార్త అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'స్త్రీ శక్తి' పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్రంలోని మొత్తం 11,449 బస్సుల్లో 8,456 బస్సుల్లో ఈ పథకం అమలు కానుంది. దీనివల్ల ఏటా సుమారు 1.42 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని, ప్రభుత్వంపై ఏటా రూ.1,942 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా వేశారు. ఈ నిర్ణయంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.800 నుంచి రూ.1000 వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఐటీ రంగానికి 'లిఫ్ట్'.. బడా కంపెనీలే లక్ష్యం**

రాష్ట్ర విభజన తర్వాత ఐటీ రంగంలో హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఐటీ, ఐటీ ఆధారిత సేవలు (ఐటీఈఎస్), గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను రాష్ట్రానికి ఆకర్షించే లక్ష్యంతో 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ టెక్ హబ్స్' (లిఫ్ట్) పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పాలసీ కింద ఫార్చ్యూన్ 500, ఫోర్బ్స్ గ్లోబల్ 2000 వంటి జాబితాలలో స్థానం పొందిన బడా కంపెనీలకు పరిశ్రమల స్థాపన కోసం తక్కువ ధరకు భూములను కేటాయిస్తారు. విశాఖ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో ఐటీకి అనువైన వాతావరణం కల్పించనున్నారు. అయితే, భూమి పొందిన కంపెనీలు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఐటీ కంపెనీ అయితే కనీసం 3,000 ఉద్యోగాలు, జీసీసీ అయితే 2,000 ఉద్యోగాలు కల్పించాలి. ప్రతి ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలనే షరతు విధించారు.

**కొత్త బార్ పాలసీ.. లాటరీతో కేటాయింపులు**

ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత బార్ పాలసీ స్థానంలో 2025–28 సంవత్సరాలకు నూతన బార్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. కార్టెల్ వ్యవస్థను నిరోధించేందుకు, పారదర్శకత పెంచేందుకు ఈసారి బార్లను లాటరీ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్సులు జారీ చేయనున్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి లైసెన్స్ ఫీజులో 50% రాయితీతో 10% రిజర్వేషన్ కల్పించారు. జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. వ్యాపార సమయాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పొడిగించారు.

**మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు**

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నివారించి, శాంతిభద్రతల సమస్యలను అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చింది. రూ.5 లక్షల లైసెన్స్ ఫీజుతో, 1000 చదరపు అడుగులకు మించకుండా ఈ పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఈ రూమ్‌లలో వంటగదికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

**సంక్షేమానికి పెద్దపీట.. ఇతర నిర్ణయాలు**

చేనేత కార్మికులు: చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, గృహాల్లోని పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించనున్నారు.

నాయీ బ్రాహ్మణులు: హెయిర్ కటింగ్ సెలూన్లకు అందిస్తున్న ఉచిత విద్యుత్ పరిమితిని నెలకు 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచారు.

పర్యాటకం: రాష్ట్రంలోని 22 ఏపీటీడీసీ హోటళ్లను, రిసార్టులను ఆరు క్లస్టర్లుగా విభజించి, వాటి అభివృద్ధి, నిర్వహణ కోసం 33 సంవత్సరాల పాటు ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు.

విద్య: గత ప్రభుత్వం విలీనం చేసిన 4,731 పాఠశాలల పునర్నిర్మాణం, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవోలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

పరిశ్రమలు: రాష్ట్రంలో పారిశ్రామిక వాడల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కోసం ఏపీఐఐసీ ద్వారా రూ.7,500 కోట్ల రుణం సమీకరించే ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

జర్నలిస్టులు: జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు కోసం కొత్త, సరళమైన నిబంధనలతో కూడిన 'ఆంధ్రప్రదేశ్ స్టేట్ మీడియా అక్రిడిటేషన్ రూల్స్ 2025'ను ఆమోదించారు.

భద్రత: సీపీఐ (మావోయిస్టు) పార్టీ, దాని అనుబంధ సంస్థలపై ఉన్న నిషేధాన్ని మరో ఏడాది పాటు పొడిగించాలని కేబినెట్ నిర్ణయించింది.

# చైనా పర్యటనకు ప్రధాని మోదీ

- షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సులో పాల్గొనేందుకు మోదీ చైనా పర్యటన
- ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో తియాంజిన్‌లో శిఖరాగ్ర సమావేశం
- సరిహద్దు గస్తీపై ఒప్పందం తర్వాత మెరుగైన సంబంధాలు
- ఇటీవలే చైనాలో పర్యటించిన రాజ్‌నాథ్, జైశంకర్, అజిత్ దోభాల్
- నాలుగేళ్లుగా నెలకొన్న ప్రతిష్టంభనకు తెర!

**న్యూఢిల్లీ – ఆంధ్రనాడు, ఆగస్టు 06**

భారత్, చైనా సంబంధాలలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. గల్వాన్ లోయ ఘర్షణల అనంతరం తొలిసారిగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనాలో పర్యటించనున్నారు. చైనాలోని తియాంజిన్ నగరంలో ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీలలో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఆయన వెళ్లనున్నారు. 2020లో గల్వాన్‌లో ఇరు దేశాల సైనికుల మధ్య జరిగిన ఘర్షణల తర్వాత ద్వైపాక్షిక సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగేళ్ల తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత నాలుగేళ్లుగా వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వెంబడి నెలకొన్న సైనిక ప్రతిష్టంభనకు తెరదించుతూ, సుమారు 3500 కిలోమీటర్ల సరిహద్దులో గస్తీ నిర్వహణపై ఇరు దేశాలు ఇటీవల ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం తర్వాత ద్వైపాక్షిక చర్చల్లో కీలక పురోగతి లభించింది. ఈ సానుకూల వాతావరణంలోనే ప్రధాని పర్యటన ఖరారైంది. చివరిసారిగా ప్రధాని మోదీ 2019లో చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2024లో రష్యాలోని కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సు సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. ప్రధాని పర్యటనకు ముందు, గత రెండు నెలలుగా భారత ఉన్నత స్థాయి ప్రతినిధులు చైనాలో పర్యటించారు. జూలైలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎస్సీవో విదేశాంగ మంత్రుల సమావేశం కోసం తియాంజిన్ వెళ్లి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో చర్చలు జరిపారు. జూన్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ కూడా వేర్వేరు ఎస్సీవో సమావేశాల కోసం చైనాను సందర్శించారు. ఈ పర్యటనల సందర్భంగా భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. ఉగ్రవాదంపై ఆందోళనలను చేర్చలేదన్న కారణంతో ఎస్సీవో రక్షణ మంత్రుల సంయుక్త ప్రకటనను భారత్ అంగీకరించలేదు. ఉగ్రవాదంపై ద్వంద్వ వైఖరిని విడనాడాలని, లష్కరే తోయిబా, జైషే మహ్మద్ వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అజిత్ దోభాల్ ఎస్సీవో వేదికగా గట్టిగా డిమాండ్ చేశారు. ఈ పరిణామాల తర్వాత జరుగుతున్న ప్రధాని మోదీ పర్యటనపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది.

# ఎస్ఐఆర్‌పై చర్చించాలి

(మొదటిపేజీ తరువాయి)

కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. ఈ గందరగోళ పరిస్థితుల్లోనే ఎటువంటి చర్చ లేకుండా మర్చంట్ షిప్పింగ్ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను గురువారానికి వాయిదా వేశారు. ఇటు రాజ్యసభలోనే ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. దీంతో సభ తొలుత మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడగా, తిరిగి ప్రారంభమైన సభలోనూ ఆందోళన కొనసాగడంతో ఏకంగా గురువారానికి వాయిదా పడింది.

**పార్లమెంట్‌లో ఎస్ఐఆర్‌పై చర్చించలేం: మంత్రి రిజిజు**

పార్లమెంట్‌లో బీహార్ ఎస్ఐఆర్‌పై చర్చించలేమని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆయన లోక్‌సభలో మాట్లా డుతూ ఓటర్ల జాబితా సవరణ అంశంపై పార్లమెంట్‌లో చర్చించడం అంటే, అన్ని నియమాలను ఉల్లంఘించినట్లు అవుతుం దని ఆయన అన్నారు. సభ సజావుగా సాగేందుకు ప్రతిపక్ష ఎంపీలు సహకరించాలని ఆయన కోరారు. సభా కార్యక్రమాను అడ్డుకోరాదన్నారు. మనం చర్చించడం కోసం చాలా ముఖ్యమైన విషయాలు ఉన్నాయని, జాతీయ క్రీడా విధాన్ని తామేమీ ప్రవేశపెట్టడంలేదన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం అనేది వ్యక్తిగత వ్యవస్థ అని, సుప్రీంకోర్టులో ఆ కేసు ఉందని, ఆ అంశాలను పార్లమెంట్‌లో చర్చించలేమని మంత్రి రిజిజు అన్నారు. ఎస్ఐఆర్ అనేది ఎన్నికల కమిషన్ నిర్వహించే రాజ్యాంగ ప్రక్రియ అని, పార్లమెంటరీ చర్చకు లోబడి ఉండదని అన్నారు.

**జవాబుదారీతనం నుంచి తప్పించుకోవటమే.. ప్రియాంక గాంధీ**

బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై మాట్లాడిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ప్రభుత్వం జవాబుదారీతనం నుంచి తప్పించు కుంటుందని ఆరోపించారు. చర్చను నిర్వహించడానికి అధికార పార్టీ విముఖత వ్యక్తం చేయడం దారుణమన్నారు. ప్రతిపక్షం చర్చ కోసం మాత్రమే అడుగుతోందని, ప్రభుత్వం కోరుకుంటే ఈ సమస్యను పరిష్కరించవచ్చని అన్నారు. " అధికారపక్ష సభ్యులు అంత బలహీనంగా మారారా? వారు పార్లమెంటును నడపలేకపోతున్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై స్పందించలేకపోతున్నారు" అని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం కోసం ఎన్నికల సంస్కరణలపై చర్చించే ప్రాముఖ్యతను డీఎంకే ఎంపీ కనిమొళి స్పష్టం చేశారు. ప్రభుత్వం దానిని అనుమతించక పోవడాన్ని విచారకరమని అన్నారు.

**మేం చర్చ జరపాలని కోరుతున్నాం : ఖర్గే**

రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై చర్చ జరగాలని మేం కోరుతున్నాం. ప్రతి ఒక్కరూ స్పీకర్, చైర్మెన్, ప్రభుత్వాన్ని చాలా ప్రశాంతంగా అడుగుతూనే ఉన్నారు. మా ఓట్లు దొంగలించకూడదు. ఓటర్ల జాబితాలోని అవకతవకలు, ఓట్ల దొంగతనం గురించి చర్చించడానికి మాకు సమయం కావాలని కోరుతున్నాం. పూర్తి చర్చ జరిగితే వారు ఎక్కడ తప్పులు చేసినా, రాజ్యాంగ విరుద్ధమైన రీతిలో ఏమి చేసినా సమాధానం, సూచనలు ఇవ్వగలం. దేశ ప్రయోజనాల దృష్ట్యా, ముఖ్యంగా తమ హక్కులను కోల్పోతున్న ఓటర్లను మనం రక్షించగలం. 2023 జూలై 21న అప్పటి చైర్మెన్ జగదీప్ ధన్కర్ మాట్లాడుతూ సభకు ప్రతిదాని గురించి చర్చించే హక్కు కలిగి ఉంది. ఎవరి ఓట్లు కోతకు గురవుతున్నాయి? మైనార్టీ ఓట్లు కోతకు గురవుతున్నాయి. దళిత ఓట్లు కోతకు గురవు తున్నాయి. గిరిజన ఓట్లు కోతకు గురవుతున్నాయి. ఉపాధి హామీ కార్మికుల ఓట్లు కోతకు గురవు తున్నాయి, వలస కార్మికుల హక్కులను కోల్పోతున్నారు" అని అన్నారు.

**పార్లమెంట్ ఆవరణలో ఆందోళన**

పార్లమెంట్ ఆవరణలో బీహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)కి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. మంగళవారం పార్లమెంట్ ఆవరణంలో ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేట్టారు. ప్లకార్డులు పట్టుకుని మోడీ ప్రభుత్వానికి, కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాల హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, ప్రియాంక గాధీ, సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్, డీఎంకే ఎంపీ కనిమొళి ఇతర ప్రతిపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభ వాయిదా పడిన తరువాత కూడా ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి.

# ఘనంగా నాగదేవతల ప్రతిష్ట

## శ్రీ అశ్వత్థ నారాయణ స్వామి కళ్యాణోత్సవం





**రామకుప్పం- ఆంధ్రనాడు, ఆగస్టు 6:** మానసిక ప్రశాంతతకు కోరిన కోరికలు తీరేందుకు, కుటుంబం, దేశం బాగు కోసం యజ్ఞాలు హెూమాలు చేస్తారు కానీ కా లక్రమే న అవి తగ్గిపోతున్నాయి అటువంటి దానికి కొందరు హిందూ ధర్మం పట్ల అపారమైన నమ్మకంతో యజ్ఞాలు హెూమాలు దైవ ప్రతిష్ట చేస్తున్నారు రామ కుప్పం కు చెందిన అరుణ మెస్ నాగరాజు కుటుంబీకులు రామకుప్పం మండలం చింత కుప్పం వద్ద శ్రీనాగదేవత ల ప్రతిష్ట, శ్రీ అశ్వత్ నారాయణ కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు గ్రామంలో వేప రాగి చెట్లు పురాతన కాలం నాటివి వాటిని గ్రామస్తులు సంరక్షణ చేశారు , రామకుప్పం కు చెందిన అరుణ మెస్ నాగరాజు తన సొంత ఖర్చులతో వృక్షాలు చుట్టూ రాతితో కట్టడాలు నిర్మించారు బ్రాహ్మణులతో అక్కడ శ్రీ నాగ దేవతల ప్రతిష్ట చేపించి, శ్రీ అశ్వర్థ నారాయణస్వామి కళ్యాణోత్సవం జరిపించారు గణపతి హెూమం, నవగ్రహ హెూమం, శాంతి, రక్ష హెూమం నిర్వహించారు గ్రామంలోని గంగమ్మ దేవాలయంలో 16 కలశాల పూజ చేసి కుటుంబీకులతో దేవాలయం కు ఊరేగింపుగా వచ్చి స్వామివార్లకు అభిషేకం చేశారు 41 రోజు విగ్రహాలను, నీరు, నవ ధాన్యాలతో పూజలో ఉంచి ప్రతిష్ట చేశారు పూజలుఅనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు ఈ కార్యక్రమంలో చింతకుప్పం గ్రామస్తులు సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# గణనాధుని సేవలో సినీ నటి రమ్యకృష్ణ



**కాణిపాకం- ఆంధ్రనాడు, ఆగస్టు 6:** కాణిపాక స్వామివారిని దర్శించుకున్న సినీ నటి రమ్యకృష్ణ. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారిని దర్శించుకున్న అగ్ర సినీ నటి రమ్యకృష్ణ , స్వామి వారిని దర్శించుకున్నారు, వీరికి దర్శన ఏర్పాట్లు చేసి అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులచే ఆశీర్వాదం అందుకున్నారు, స్వామివారి తీర్థప్రసాదాలు చిత్రపటాన్ని అందజేసిన సూపరెంటెంట్ వాసు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు ఉన్నారు.

# 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం'



**కాణిపాకం- ఆంధ్రనాడు, ఆగస్టు 6:** రండి టి తాగుతూ మాట్లాడుకుందాం. కాణిపాకం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉద్యోగులతో రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం నిర్వహించారు కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన ఇప్పటివరకు ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం అన్యాయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు వి. శివయ్య ఆరోపించారు ఇప్పటికే సుమారు 25 వేల కోట్ల ప్రభుత్వ బకాయిల చెల్లించాల్సింది ఉందన్నారు, ఇప్పటి పరిస్థితులలో అంత పెద్ద మొత్తంలో బకాయిలు చెల్లించే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు కావున ప్రత్యామ్యంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను ఇల్లు స్థలాలుగా కేటాయించి వారికి ఇవ్వవలసిన బకాయిలను జమ చేసుకోవాలని కోరారు, ఉద్యోగుల సమస్యలను మా సంఘం దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వానికి విన్నవిస్తామని తెలియజేశారు.

# తల్లిపాలే బిడ్డలకు ఎంతో శ్రేయస్కరం

## - స్వాస్థ్య ఆసుపత్రి వైద్యుల సూచన

మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగస్టు 06: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని స్వాస్థ్య ఆసుపత్రి వైద్యుల తల్లులకు సూచించారు.ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో నిర్వహించే తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని,స్థానిక నక్కలదిన్నె వద్ద గల స్వాస్థ్య హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా పట్టణంలోని కుమారపురం,కురవంక అంగన్వాడీ కేంద్రాలలో వైద్యులు ప్రత్యేకంగా తల్లులతో సమావేశమై తల్లి పాల ప్రాముఖ్యత,పుష్టికర ఆహారం,శిశు ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై వివరంగా చర్చించారు.సుమారు 50 మందికి పైగా తల్లులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలకు వైద్యుల సూచనల ద్వారా నివృత్తి చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గాంధీపురం ఇంచార్జ్ తలారి రాధ,స్వాస్థ్య హాస్పిటల్ వైద్యులు,ఏఎన్ఎంలు,ఆశ వర్కర్లు,అంగన్వాడీ టీచర్లు,సహాయకులు పాల్గొన్నారు.



# అమ్మ పేరుతో

# మొక్క నాటుదాం...పర్యావరణాన్ని కాపాడుదాం

**- మానవ జీవితం పచ్చదనంతో ముడిపడింది**
**- మాజీ ముఖ్య మంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి**







మదనపల్లి –ఆంధ్రనాడు, ఆగస్టు 06: చెట్లు లేని కారణంగానే పర్యావరణ సమతుల్యత లోపిస్తోందని మాజీ ముఖ్య మంత్రి,బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.బుధవారం మదనపల్లి మండలం, పొన్నూటి పాళ్యం,గ్రామ పంచాయతీ రామిరెడ్డి గారిపల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద బిజెపి అధిష్టానం పిలుపు మేరకు రూరల్ మండల అధ్యక్షులు తరిగొండ వెంకట రమణా రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తల్లి పేరుతో మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ముఖ్యమంత్రి,జిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా బిజెపి పార్టీ నాయకులతో కలసి ఆయన మొక్కలు నాటారు.అనంతరం ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏదేని సందర్భంగా ఒక చెట్టు కొట్టివేస్తే అ స్థానం భర్తీ చేయడానికి వంద మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాలు అత్యధికంగా ఏర్పడుతున్నాయంటే పర్యావరణం హరించుకుపోవడమేనన్నారు.మానవ జీవితం పచ్చదనంతో ముడి పడిందని గుర్తు చేశారు.మనిషి ఆరోగ్యంగా జీవించడానికి ప్రతి ఒక్కరు తల్లి పేరుతో ఒక మొక్క నాటి వాటిని సంరక్షించే బాధ్యత చేపట్టాలని పిలుపునిచ్చారు. భూభాగంలో 35 శాతం పచ్చదనంతో అడవులు ఉండాలన్నారు.ప్రధాని మోడీ ప్రభుత్వం 11 ఏళ్లుగా దినదినాభివృద్ధి చెందుతుందో,ఆదే స్ఫూర్తితో నేడు మొక్కలు నాటితే అవి భావితరాలకు ఎంతో మేలు చేస్తాయన్నారు.నేడు విద్యార్థులకు బాల్యం నుండి మొక్కలు నాటి,వాటి సంరక్షణ, పర్యావరణం, కాలుష్య నియంత్రణపై అవగాహన పెంచేలా పాఠాలు బోధించాలని కోరారు.

అనంతరం రూరల్ మండల అధ్యక్షులు తరిగొండ వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ మనిషి జీవితానికి తల్లి ఎంత ముఖ్యమో చెట్టు కూడ అంతే ముఖ్యమన్నారు.ప్రతి ఒక్కరూ తల్లి పేరుతో ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆకాం క్షించారు. మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వ హించడం జరుగుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమ ంలో బిజెపి నాయకులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి, యల్ల ంపల్లి ప్రశాంత్,మూడే పిల్లస్వామి నాయక్,ఓసూరి కిరణ్ కుమార్,బొజ్జప్ప,బండి ఆనంద్ పెద్దఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

# సీతమ్స్ కళాశాలలో నేషనల్ స్పేస్ డే

**- రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబొరేటరీ ద్వారా త్వరలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు**
**- వైజ్ఞానిక ప్రపంచం లో విద్యార్థులు జ్ఞాన సముపార్జనకు ఆసక్తి చూపాలి: కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు, కలెక్టరేట్–ఆంధ్రనాడు,ఆగస్ట్ 6:** నేటి వైజ్ఞానిక ప్రపంచంలో విద్యార్థులు ్ఞన సముపార్జనకు ఆసక్తి చూపాలనిలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు లోని సీతమ్స్ కళాశాలలో నిర్వహించిన నేషనల్ స్పేస్ డే ఈరోజు రేపు నిర్వహించే కార్యక్రమాలకు జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఎం ఏ ఆర్ ఎల్ డైరెక్టర్ డా.అమిత్ కుమార్ పాత్రా, షార్ జీఎం కృతివాసన్, కళాశాల ప్రిన్సిపల్ వెంకట చలపతి, కళాశాల సెక్రటరీ బద్రీ నారాయణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం 2023వ సంవత్సరంలో చంద్రయాన్ –3ని విజయవంతంగా ప్రయోగించిన సందర్భంగా నేషనల్ స్పేస్ డే కార్యక్రమం జరుపు కుంటున్నామని తెలిపారు. రెండు రోజులు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో దాదాపు 2,000మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. ప్రపంచం సాంకేతి కమయం అయిందని, వైజ్ఞానికప్రపంచంలో ఇమడాలంటే విద్యార్థులు తరగతి గదులలో విద్యతో పాటు అదనంగా ్ఞనాన్ని సంపాదించు కోవాలన్నారు. విద్యార్థులు 9వ తరగతి నుండే అదనంగా నంసంపాదించు కోవడానికి ఆసక్తి చూపాలన్నారు. అందుకు అవసరమైన సమాచారం పుస్తకాలతో పాటు ఇంటర్నెట్ ద్వారా కూడాతెలుసుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నేషనల్ అటామిక్ రీసెర్చ్ లాబొరేటరీ సహకారంతో విద్యార్థులకు త్వరలో 50 రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అంతరిక్ష పరిశోధన లగురించి తెలియని అంశాలను తెలుసుకోవడానికి విద్యార్థులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. అనంతరం షా జీఎం కృతివాసన్, మాట్లాడుతూ ఇటీవల జి ఎస్ ఎల్ వి–ఎఫ్ 16 ప్రయోగం విజయవంతం అయిందని తెలిపారు ఇస్రో చరిత్రలో ఈ ప్రయోగం ఒక మైలురాయిగా నిలిచిందని తెలిపారు, రాబోయే రోజులలో చంద్రయాన్–4 ప్రయోగానికి శ్రీకారం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పలువురు వ్యక్తులు అంతరిక్షం పై మాట్లాడారు.చంద్రయాన్ 1, 2 అండ్ 3 లక్ష్యాలుమరియు వాటిని యొక్క విశిష్టత గురించి సమీక్షించారు.ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆవరణలో రాకెట్ లాంచింగ్, క్విజ్ ప్రోగ్రామ్ ఉంటుందని, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని విజ్ఞానం సంపాదించు కోవాలన్నారు. క్విజ్ కార్యక్రమాలను, సాంకేతిక కార్య క్రమాల్లోనూ వివిధ సంస్థల్లోని విద్యార్థులు పాల్గొని తమ నమూనాలను ప్రదర్శిస్తున్నారు. ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, యుజి, ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన సుమారు 6000 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనాలని భావిస్తున్నారు.

# గ్రామాలలో అభివృద్ది పనులు వేగవంతం చేయాలి

## -కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, కలెక్టరేట్–ఆంధ్రనాడు,ఆగస్ట్ 6:** జిల్లాలో 15 ఆర్థిక కమిషన్ నిధులుమరియు జిల్లా మమ్మమపరిషత్ సాధారణ నిధుల కింద తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్పీ కార్యాలయంలోనే ఎన్టీఆర్ సమావేశం మందిరంలో జిల్లాలోని 15 ఆర్థిక సంఘం ద్వారా వివిధ మండలాలకు వచ్చిన నిధులను, మండలాలలో వివిధ అభివృద్ధి పనులు ఎలా చేపడుతున్నారు, వివిధ మండలాలలో పనులు ఎలా జరుగుతున్నాయని వాటిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవి ప్రకాష్ నాయుడు, ఎస్. ఈ ఆర్డబ్ల్యూఎస్ విజయ్ కుమార్, పంచాయతీరాజ్శాఖ ఎస్. ఈచంద్రశేఖర్ రెడ్డి, ఎంపీడీవోలతో, పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15 వ ఆర్థిక కమిషన్ నిధులు, జిల్లా పరిషత్ సాధారణ నిధుల కింద గ్రామాలలో తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలనిజిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కాలనీలలోలేఔట్లలో సమస్యలు ఉన్నట్లయితే వాటిని ఎంపీడీవోలు తాసిల్దార్లతో సమన్వయం చేసుకొనిత్వరితగతినపరిష్కరించాలన్నారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసిజడ్పీసీ ఈఓవారికి సమర్పిం చాలని తెలిపారు. ఎన్టిఆర్ హౌసింగ్ నిర్మాణాలలో మౌలిక వసతులు ఖచ్చితంగా ఉండాలని అందుకు సంబంధించిన శాఖ అధికారులు త్వరితగతిన నాణ్యమైన పనులు చేపట్టాలని ఆదేశించారు. వివిధ గ్రామాలలో ఏమైనా పనులు జరగకపోతే అట్టి వాటి వివరాలను జడ్పి సీఈఓ గారికి తెలియజేసి నివేదిక సమర్పించాలన్నారు. ఇంకో నెలలోపు పనులన్నీ పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన డేటా క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను లేఖ రూపంలో జడ్పి సీఈఓ వారికి అందజేయాలని తెలిపారు.జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులలో రూ.146 కోట్ల అంచనా విలువగల 204, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా త్రాగునీటికి సంబంధించి రూ.93.17 కోట్ల అంచనా విలువగల 257 పనులు పెండింగ్ లో ఉన్నాయని, నిర్దేశిత కాలంలోపు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీజ వీసీజి ఎంఆర్జీ మహిళా సభ్యులకు శిక్షణ

**ఏర్పేడు –ఆంధ్రనాడు ,ఆగస్టు 6:** జైకా ప్రాజెక్టు సహకారంతో ఏర్పేడు మండలంలోని మహిళా సమైక్య కార్యాలయంలో శ్రీజ వీసీజీ,ఎంఆర్జి మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పేడు శ్రీజ పాల శీతలీకరణ ఏరియా మేనేజర్ విశ్వనాథం మాట్లాడుతూ శ్రీజ సంస్థ నేషనల్ డైరీ డెవలప్మెంట్ ( డి ఆర్ డి ఓ ) సహకారంతో మహిళ పాల ఉత్పత్తిదారుల కోసం ఏర్పడిందని, దీన్ని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ నుండి చైర్మన్ వరకు అందరూ మహిళలే కావడం విశేషమని అన్నారు. పాల సేకరణలో శ్రీజ భారతదేశంలో రెండువ స్థానంలో ఉండగా, ఏపీలో మూడో స్థానంలో ఉందని తెలిపారు. వీసీజీ ( గ్రామస్థాయి) సభ్యుల విధులు, బాధ్యతలను వివరిస్తూ, ప్రతి ఏడు మంది సభ్యుల్లో ఒకరిని ఎన్నుకుంటారని, వారికి చదవడం, వ్రాయడం తెలిసి ఉండాలని అలాగే ఎంఆర్జి( మండల స్థాయి ) సభ్యురాలిని కనీసం ఏడవ తరగతి చదువుకున్న వారిలో నుంచి ఎంపిక చేస్తారని, వీరికి శిక్షణ కార్యక్రమాలకు వెళ్లే బాధ్యత ఉంటుందని తెలిపారు. రైతులు పాల నాణ్యతను పెంచేందుకు శ్రీజ క్యాటిల్ ఫీడ్, మినరల్ మిక్సర్ ని వాడాలని సూచించారు. మహిళ ఆర్థిక అభివృద్ధికి శ్రీజ ఎల్లప్పుడూ తోడ్పడుతుందని, డ్వాక్రా సంఘాల ద్వారా ఆవులు కొనుగోలుకు రుణ సహాయం అందిస్తుందని వివరించారు. ఏరియా పిఐబి అధికారి నాగభూషణ్ యాదవ్ మాట్లాడుతూ శ్రీజ సంస్థ 2014లో 27 మందితో ప్రారంభమై ప్రస్తుతం లక్ష 20 వేలు పైగా మహిళా సభ్యులతో ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో నాలుగు వేల గ్రామాలకు విస్తరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఐబి చెంచు మోహన్,శ్రీజ డైరీ ఏపీఎం సరిత,ఏరియా సూపర్వైజర్ సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు. చివరగా అందరూ తమ బాధ్యతలను నిర్వహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.



## ఆటలు SPORTS

## సినిమా CINEMA




# గ్రాండ్‌స్లామ్ ప్రైజ్ మనీ పెంపు

## - 20శాతం పెంపుదల చేస్తున్నట్లు ప్రకటన

**న్యూయార్క్:** టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని పెంపుదల చేయాలని కోరుతూ స్టార్ ఆటగాళ్లు జకోవిచ్, కోకో గాఫ్, సబలెంక, సిన్నర్ తదితరులు లేఖలు పంపిన క్రమంలో టోర్నీ నిర్వాహకులు ప్రైజ్ మనీని పెంపుదల చేస్తున్నట్లు సమాచారం. 2025లో వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసిన ప్రైజ్ మనీని పెంపుదల చేయగా.. తాజాగా యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ నిర్వాహకులు కూడా 20శాతం ప్రైజ్‌మనీని పెంపుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు యుఎస్ టెన్నిస్ అసోసియేషన్ బుధవారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది.

యుఎస్ ఓపెన్‌లో ఆటగాళ్లందదరూ కలిపి భారత కరెన్సీలో సుమారు 746కోట్ల రూపాయలు (85 మిలియన్ డాలర్లు) ప్రైజ్‌మనీ అందుకోనున్నారు. సింగిల్ విజేత 5 మిలయన్ డాలర్ల ప్రైజ్ మనీ అందుకోనుండగా.. గత ఏడాదితో పోల్చిచూస్తే టోర్నీ నిర్వాహకులు ఆటగాళ్లకు అందజేసే ప్రైజ్ మనీని 20 శాతం నుంచి 90శాతం మిలియన్ డాలర్లకు పెంచుతున్నట్లు తాజాగా తెలిపారు. నాలుగు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలోకెల్లా ఇదే అత్యధిక పారితోషికం కావడం విశేషం. 2024లో 75మిలియన్ డాలర్ల ప్రైజ్ మనీ అందజేయగా.. ఈసారి అది 90మిలియన్ డాలర్లకు చేరింది.

# ఇక మన హైదరాబాదీనే భారత పేస్ దళపతి.. భవిష్యత్ కెప్టెన్

## - ఏమాత్రం ఆశలు లేని స్థితి నుంచి జట్టును గెలిపించిన తీరు అమోఘం.. దీంతో ప్రస్తుతం నేషనల్ హీరో అయిపోయాడు...! అతడే మన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్



ఐదుకు ఐదు టెస్టులు... 185.3 ఓవర్లు... 1113 బంతులు... 23 వికెట్లు..! అలసటే లేదు.. గాయం మాట అన్నదే లేదు.. సిరీస్ లో రెండు టెస్టులు గెలిస్తే రెండింట్లోనూ అతడి పాత్ర కీలకం.. చివరి మ్యాచ్ లో అయితే ఒక ప్రత్యర్థికి చుక్కలు చూపాడు.. ఏమాత్రం ఆశలు లేని స్థితి నుంచి జట్టును గెలిపించిన తీరు అమోఘం.. దీంతో ప్రస్తుతం నేషనల్ హీరో అయిపోయాడు...! అతడే మన హైదరాబాదీ పేసర్ మొహమ్మద్ సిరాజ్.

**గాయం ఎరుగుని పేసు గుర్రం:** మొహమ్మద్ షమీకి గాయాల బెడద ఉంది.. వయసు కూడా 35. మళ్లీ అతడు జాతీయ జట్టుకు ఆడడం కష్టమే.. జస్ప్రీత్ బుమ్రాకు గాయాల సమస్య మరింత తీవ్రం.. ప్రస్తుత ఇంగ్లండ్ టెస్టు సిరీస్ లో మూడు టెస్టులు ఆడడమే గగనమైంది. కొత్త కుర్రాళ్లు ప్రసిద్ధ్ క్రిష్ణ, ఆకాశ్ దీప్ ఇంకా కుదురుకోలేదు..! కానీ, ఒకే ఒక్కడు అన్నట్లు సిరాజ్ చెలరేగిపోతున్నాడు. ఏమాత్రం అలుపుసొలుపు లేకుండా బౌలింగ్ చేస్తూనే ఉన్నాడు. ప్రత్యర్థి బ్యాట్స్ మెన్ చితకబాదుతున్నా.. తనదైన సమయం కోసం ఎదురుచూసి వికెట్లు తీస్తున్నాడు. గత 10 నెలల కాలంలో అతడు ఎక్కడా విశ్రాంతి తీసుకున్నదే లేదు. ఐపీఎల్ సహా..!

**బుమ్రా లేకుంటేనే సిరాజ్ బజ్:** జట్టులో ఉంటే భారత ప్రధాన పేస్ బౌలర్ బుమ్రానే. కానీ, ఇకమీదట సిరాజ్ తర్వాతే బుమ్రా. 41 టెస్టులు ఆడిన 123 వికెట్లు తీశాడు. 25 మ్యాచ్ లలో బుమ్రాతో కలిసి బౌలింగ్ చేస్తే 74 వికెట్లు తీశాడు. బుమ్రా లేకుండా ఆడిన 16 టెస్టుల్లో 49 వికెట్లు పడగొట్టాడు. తాజా ఇంగ్లండ్ సిరీస్ లో టీమ్ఇండియా గెలిచిన ఎడ్జ్‌బాస్టన్, ఓవల్ టెస్టుల్లో బుమ్రా లేడు. ఈ రెండు టెస్టుల్లో సిరాజ్ 16 వికెట్లు తీశాడు. అందుకే.. బుమ్రా అందుబాటులోకి వచ్చినా ఇకమీదట సిరాజే భారత ప్రధాన పేసర్ అని ప్రఖ్యాత క్రికెటర్, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ గ్రెగ్ చాపెల్ అభిప్రాయపడ్డాడు.

**బుమ్రా కంటే బెటర్...:** జస్ప్రీత్ బుమ్రా త్వరలో టెస్టు క్రికెట్ వీడ్కోలు పలుకుతాడనే కథనాలు వస్తున్నాయి. ఇదే నిజమైతే సిరాజ్ ది ప్రధాన పాత్ర అవుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సిరీస్ లలో సిరాజ్ అదరగొట్టాడు. వీటిలో చాలాసార్లు బుమ్రా అందుబాటులో లేడు. ఇంగ్లండ్ పై ఓవల్ టెస్టులో బుమ్రా లేకున్నా.. జట్టును గెలిపించడంతో సిరాజ్ స్థాయి మరింత పెరిగింది. దీంతోనే బుమ్రా వర్సెస్ సిరాజ్ అనే ఆరోగ్యకర చర్చ నడుస్తోంది. బుమ్రా అత్యంత ప్రతిభావంతుడైన బౌలర్ అయినప్పటికీ... ఫిట్ నెస్, ఫామ్ రీత్యా సిరాజ్ కే కాస్త ఎక్కువ మార్కులు పడుతున్నాయి. ఐపీఎల్ లో అన్ని మ్యాచ్ లు ఆడిన బుమ్రా.. జాతీయ జట్టుకు కొన్ని మ్యాచ్ లకే అందుబాటులో ఉన్నాడు. సిరాజ్ మాత్రం ఐపీఎల్ ఆడినా.. అనుభవం లేని కుర్రాళ్లతో పేస్ దళాన్ని నడిపించి మంచి మార్కులు కొట్టేశాడు. ఇక ఓవల్ టెస్టులో అతడి అంకితభావం, పోరాట పటిమ అభిమానులను లిసలామ్ డీఎస్పీ సాబ్‌లి అనిపించింది. 31 ఏళ్ల సిరాజ్ ప్రస్తుతం ప్రధాన బౌలర్.. భవిష్యత్ లో శుబ్ మన్ గిల్, రిషభ్ పంత్ అందుబాటులో లేకుంటే కెప్టెన్ అయ్యే చాన్సుంది. ఏమో.. దేన్నీ కాదనలేం.. 2015 వరకు క్రికెట్ బంతితో ప్రాక్టీస్ చేయని, సాధారణ ఆటో డ్రైవర్ కుమారుడు అయిన సిరాజ్ ఇక్కడి వరకు రాలేదా? ఒకవేళ అతడు టీమ్ఇండియా కెప్టెన్ అయితే.. అజహరుద్దీన్ తర్వాత టీమ్ ఇండియాకు మరో హైదరాబాదీ ఆటగాడు కెప్టెన్ అయిన రికార్డు దక్కుతుంది.




# 'ఘాట్ లో ఘాటీలే ఉంటారు సార్'.. పవర్ ఫుల్ గా ఘాటీ ట్రైలర్..

## - టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఆ సినిమా కూడా ఒకటన్న విషయం తెలిసిందే. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి.. ఇప్పుడు కెరీర్ లో మళ్ళీ స్పీడ్ పెంచింది. చివరగా మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి మూవీతో వచ్చి మంచి విజయాన్ని అందుకున్న అమ్మడు.. ఇప్పుడు ప్రతిష్టాత్మక మూవీ ఘాటీతో సందడి చేయనుంది. టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఆ సినిమా కూడా ఒకటన్న విషయం తెలిసిందే. విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాను క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే అనుష్క, క్రిష్ కాంబోలో వచ్చిన వేదం మూవీ మెప్పించింది. ఇప్పుడు మరోసారి కాంబో రిపీట్ అవ్వడంతో అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు. అదే సమయంలో సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ పాజిటివ్ బజ్ క్రియేట్ చేసి అంచనాలు పెంచాయి.తాజాగా మూవీ ట్రైలర్ విడుదల చేశారు మేకర్స్. విడుదల తేదీపై కూడా క్లారిటీ ఇచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన సినిమాను రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. థియేటర్లలో చిత్రం ప్రేక్షకులను అలరించనుందని మేకర్స్ హామీ ఇస్తున్నారు. అదే సమయంలో ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినీ ప్రియులను ఆకట్టుకుని దూసుకుపోతోంది. ట్రెండింగ్ లో కూడా నిలిచింది.ఘాట్లకు చెందిన వ్యక్తిగా అనుష్కను పరిచయం చేశారు మేకర్స్. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తుంటుంది. ఆమె పార్ట్ టైమ్‌లో బస్ కండక్టర్‌గా పని చేస్తుంటుంది. ఆ టిపికల్ జాబ్‌లో కూడా స్ట్రాంగ్‌గా వర్క్ చేస్తుం టుంది. విక్రమ్ ప్రభు ఆమె ప్రేమికుడిగా, విప్లవకారుడిగా కనిపిస్తాడు. చైతన్యరావు, జాన్‌విజయ్, రవీంద్ర విజయ్ విరో ధులుగా.. జగపతిబాబు పోలీసు అధికారిగా కనిపిస్తారు. సినిమాలో అనుష్క నేరస్థురాలిగా మారిన ఓబాధితురాలిగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఆమె చేతి పైన ఓవిచిత్రమైన టాటూ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచింది. ఓవరాల్‌గా అనుష్కను ఫుల్ వైలెంట్ గా చూపించారు మేకర్స్. అనుష్క కనిపించిన ప్రతి షాట్ చూడటానికి ఒక విందుగా ఉంటుంది. ఘాట్‌లో ఘాటీలే ఉంటారు సార్ అంటూ ఆమె చెప్పే డైలాగ్స్ అదిరిపోయాయి. కఠినమైన కథను ప్రేక్షకులను భావోద్వేగాలతో కదిలించే విధంగా చెప్పడానికి దర్శకుడు క్రిష్ చాలా ప్రయత్నించినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. అద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ట్రైలర్ కు బిగ్ అసెట్‌గా నిలిచింది. యాక్షన్ సీన్స్ అదిరిపోయాయి. క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. ఓవరాల్ గా ట్రైలర్ ను మేకర్స్ బాగా కట్ చేశారని చెప్పాలి. ష్యూర్ షాట్ విన్నర్‌గా నిలిచిన ట్రైలర్ సినిమాపై ఆసక్తిని భారీగా రేపింది.

# సొంత ఇలాకాలో కనుమరుగవుతున్న అవకాశాలు.. సౌత్‌పై పడ్డ మృణాల్ దృష్టి!

## - కానీ అక్కడ చేసే సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో మళ్ళీ సౌత్ ఇండస్ట్రీ పైపే అడుగులు వేస్తున్నారు



హీరోయిన్ అవ్వాలనే ఆశయంతో సీరియల్స్ ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది మృణాల్ ఠాకూర్. పలు సీరియల్స్ లో మెప్పించి ఆ తర్వాత మరాఠీ, హిందీ సినిమాల ద్వారా హీరోయిన్‌గా మారింది. అలా నార్త్ లో సినిమాలు చేస్తున్న టైంలో మృణాల్ ఠాకూర్‌కి తెలుగులో సీతారామం అనే సినిమాలో అవకాశం వచ్చింది. ఈ సినిమా మృణాల్ సినీ జీవితాన్నే మార్చేసిందని చెప్పవచ్చు. ఈ సినిమాతో మృణాల్ కి చాలా క్రేజ్ కూడా వచ్చింది. ఆ తర్వాత వరుస అవకాశాలు తలుపు తట్టాయ్. అయితే చాలామంది హీరోయిన్లు సౌత్ సినిమాల ద్వారా ఫేమస్ అయినప్పటికీ... వారి దృష్టంతా బాలీవుడ్ పైనే ఉంటుంది. బాలీవుడ్ లో స్టార్ గా రాణించాలని కలలు కంటారు. కానీ అక్కడ చేసే సినిమాలు ఫ్లాప్ అవ్వడంతో మళ్ళీ సౌత్ ఇండస్ట్రీ పైపే అడుగులు వేస్తున్నారు. అలాంటి వారిలో మృణాల్ ఠాకూర్ కూడా ఉందని చెప్పుకోవచ్చు. ఎందుకంటే మొదట నార్త్ లో సినిమాలు చేసి సక్సెస్ కాలేదు.కానీ సౌత్ లో చేసిన సీతారామం సినిమాతోనే సక్సెస్ అయింది. అలా సీతారామం తర్వాత హాయ్ నాన్న సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. 2024లో వచ్చిన ఫ్యామిలీ స్టార్ మూవీ నిరాశపరిచినప్పటికీ సౌత్ లో మృణాల్ క్రేజ్ అయితే తగ్గలేదు. అయితే అలాంటి మృణాల్ ఠాకూర్ బాలీవుడ్ మీద ఉన్న ఇంట్రెస్ట్ తో సన్ ఆఫ్ సర్దార్ 2 మూవీలో చేసింది. కానీ ఈ సినిమా విడుదలై బాక్సాఫీస్ వద్ద ఫ్లాప్ టాక్ తెచ్చుకుంది. అంతేకాకుండా ఈ సినిమాలో మృణాల్ కి అంత ప్రాధాన్యత కూడా లేదు. దాంతో మృణాల్ కెరీర్ ఇరకాటంలో పడిపోయింది. పైగా ఈమెకు అవకాశం ఇవ్వడానికి కూడా బాలీవుడ్ లో ఎవరు ఆసక్తి కనబరచలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. అలా సొంత ఇలాకాలో అవకాశాలు కోల్పోతుండడంతో ప్రస్తుతం మృణాల్ ఠాకూర్ ఆశలన్నీ సౌత్ సినిమాల పైన పెట్టుకుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ అడివి శేష్ డెకాయిట్ మూవీలో చేస్తోంది. ఈ సినిమా గనుక హిట్ కాకపోతే సౌత్ లో కూడా మృణాల్ మార్కెట్ పడిపోతుంది. అందుకే తన ఫోకస్ మొత్తం సౌత్ సినిమాలపైనే పెట్టిందట. ప్రస్తుతం మృణాల్ డెకాయిట్ మూవీ తోపాటు అట్లీ , అల్లుఅర్జున్ కాంబోలో వస్తున్న సినిమాలో కూడా హీరోయిన్ గా ఫిక్స్ అయినట్టు సినీ వర్గాల్లో రూమర్స్ వినిపిస్తున్నాయి. ఒకవేళ ఈ సినిమాలు హిట్ కొట్టినా చాలు మృణాల్ దశ తిరిగినట్టే.. మరి మృణాల్ ఠాకూర్ కెరీర్ మళ్ళీ గాడిన పడుతుందా? లేదా? అనేది చూడాలి.

# చెవిరెడ్డి అరెస్ట్‌కు 50 రోజులు

**- తిరుపతిలో వైసీపీ శ్రేణుల ఆవేదన వెల్లువ**

**- 216 కొబ్బరికాయలతో అమ్మవారికి మొక్కులు, వైసీపీ శ్రేణుల కన్నీటి ప్రార్థనలు**



**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అక్రమ నిర్బంధానికి ఆగస్టు 6 తో 50 రోజులు పూర్తయిన నేపథ్యంలో తిరుపతి రూరల్ మండలం, తుమ్మలగుంట పంచాయతీలోని శ్రీ శక్తి చాముండేశ్వరి అమ్మవారికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆయన విడుదల కోసం జిల్లా నేతలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 216 కొబ్బరికాయలు కొట్టి, చెవిరెడ్డి త్వరగా సంపూర్ణ ఆరోగ్యంగా విడుదల కావాలని మొక్కుకున్నారు. ఆలయంలో జరిగిన ఈ కార్యక్రమం భావోద్వేగ భరితంగా సాగింది. చెవిరెడ్డి నిర్బంధాన్ని తలుచుకుంటూ పలువురు నేతలు కన్నీటి పర్యంతమయ్యారు. చెవిరెడ్డిని అక్రమంగా కేసుల్లో ఇరికించడమే కాక, ఆయన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలనే కుట్రదారుల ప్రయత్నాన్ని నేతలు తీవ్రంగా ఖండించారు. ప్రజల హక్కుల కోసం పోరాడిన నాయకుడిని ఈ విధంగా వేధించడం సరైన ధోరణి కాదని మండిపడ్డారు. ప్రస్తుత సంకీర్ణ ప్రభుత్వం రాజకీయ పరమైన స్వార్థాల కోసం చెవిరెడ్డిపై తప్పుడు కేసులు బనాయించిందని పార్టీ నేతలు ఆరోపించారు. కరోనా కష్టకాలంలో ప్రజల కోసం ముందుండిన నాయకుడికి ఈ పరిస్థితేనా? అని ప్రశ్నించారు. చెవిరెడ్డి వంటి నాయకుడిని అ ప్రతిష్టపాలు చేయాలన్న కూటమి సర్కార్ కుట్రలు ప్రజల ముందు నిలబడలేవని స్పష్టం చేశారు. తప్పుడు కేసులు, అరెస్టులు, బెదిరింపులు వైఎస్సార్‌సీపీని నిలువరించలేవని నేతలు గట్టిగా ప్రకటించారు. జగనన్న సైన్యం ఉద్యమాల నుంచి పుట్టి, ప్రజల గుండెల్లో నిలిచినదని గుర్తు చేశారు. ఇటువంటి కుట్రలతో పార్టీని బలహీన పరచాలనుకోవడం కూటమికి కలగానే మిగులుతుందని ధ్వజమెత్తారు. ప్రతి కార్యకర్త టీడీపీ కుట్రలను బహిర్గతం చేయడంలో ముందుండాలని నేతలు పిలుపునిచ్చారు. చెవిరెడ్డి త్వరగా బయటకు వస్తారన్న నమ్మకం మాలో ఉంది. అప్పటి వరకు, పోరాటం కొనసాగుతుంది అని వారు స్పష్టం చేశారు.

# డ్రోన్ నిఘాతో మత్తు బట్టబయలు

**- మత్తు ఇంజక్షన్లతో సహా పోలీసుల అదుపులో ఆరుగురు యువకులు**



**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** జిల్లా ఎస్పీ శ్రీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎంఆర్.పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బైరాగిపట్టెడ, వాణినగర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్ నిఘాతో మత్తు బట్టబయలు అయింది. డ్రోన్ ద్వారా పరిశీలన చేపట్టగా, వాణి నగర్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశంలో చెట్లు, పొదల మధ్య ఆరుగురు యువకులు కూర్చున్న దృశ్యాన్ని డ్రోన్ కెమెరా సిబ్బంది గుర్తించారు. అనుమానాస్పదంగా కనిపించిన వారి ఆచరణపై ప్రత్యేక బృందం, స్థానిక పోలీసులతో కలిసి అక్కడే తనిఖీ చేపట్టారు. పరిశీలనలో ఆ యువకులు చేతులకు మత్తు ఇంజక్షన్లు ఎక్కించుకుంటున్నట్లు స్పష్టం కావడంతో వారిని అక్కడికక్కడే అదుపులోకి తీసుకుని ఎంఆర్.పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు మత్తు ఇంజక్షన్ల మూలాలను గుర్తించేందుకు విచారణ ప్రారంభించారు. ఈ ఇంజక్షన్లు ఎక్కడి నుంచి వచ్చాయి? ఎవరు సరఫరా చేస్తున్నారు? వీటి వెనుక ఉన్న ముఠా ఎవరిది? అన్న కోణాల్లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదనంగా, యువకుల తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ కూడా ఇచ్చారు. మత్తు అలవాట్లకు బానిసలవుతున్న యువతను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనీ, అవసరమైతే పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి రీహాబిలిటేషన్ సెంటర్లకు పంపించే ఏర్పాట్లు ఉన్నాయని వారికి వివరించారు. మీ పిల్లలు ఎక్కడ ఉన్నారు? ఏమి చేస్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం గమనించాలని పోలీసు అధికారులు తెలిపారు. ఇలాంటి సంఘటనలను అరికట్టేందుకు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలనీ, ఎవరైనా మత్తు పదార్థాల బానిసలై ఉన్నారని తెలిసినపక్షంలో 8099999977 నంబరుకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

## ఎస్వీసీఈలో మానసిక ఆరోగ్యం

# మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు

**మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక పుస్తక ఆవిష్కరణ**



**తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** సిఐఐ - యంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో, కారకంబాడిలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎస్ఎస్సిఈ)లో మానసిక ఆరోగ్యం, మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రెండు విడతలుగా జరిగిన ఈ కార్యక్రమంలో 600 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ యంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ చైర్ వర్ష కస్తూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మానసిక ఆరోగ్యంపై రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అమెరికా, న్యూయార్క్‌లోని కాల్గేట్ యూనివర్సిటీలో చదువుతున్న హర్షిత తాళసిలా తన ప్రాజెక్ట్ ఫర్ పీస్ భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో పెరుగుతున్న వివిధ రకాల వ్యసనాలపై అవగాహన కల్పిస్తూ, వాటి దుష్ప్రభావాలను విద్యార్థులకు వివరించారు. వేగంగా మారుతున్న జీవనశైలిలో మానసిక ఆరోగ్య పరిరక్షణ అత్యంత అవసరమని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ కిషోర్ కె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. మానసిక సమస్యలపై తన అనుభవాలను పంచుకుంటూ, విద్యార్థులకు మేధస్సు ప్రాధాన్యత, భావోద్వేగ నియంత్రణ, అవసరమైన సమయంలో సహాయం పొందే విధానాలపై విలువైన సూచనలు చేశారు. అనంతరం, విద్యార్థులతో వ్యక్తిగత కౌన్సిలింగ్ సెషన్లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైయంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ సభ్యులు విశ్వస్ విశ్వనాథ్, వైష్ణవి మండలం, నితిన్ డి, డాక్టర్ శివరామకృష్ణ రెడ్డి, డాక్టర్ గౌరి నందిని పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. **రేణిగుంటలో :** రేణిగుంట సమీపంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో యంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం మానసిక ఆరోగ్య మత్తుపదార్థాల అవగాహన సదస్సు, పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సదస్సును కళాశాల ప్రిన్సిపాల్ యంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ చైర్ వర్ష కస్తూరి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక పుస్తకాన్ని ఆవిష్కరించారు. అమెరికా న్యూయార్క్‌లోని కాల్గేట్ యూనివర్సిటీకి చెందిన హర్షిత తాళసిలా, తన ప్రాజెక్ట్ ఫర్ పీస్, భాగంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమాజంలో పెరుగుతున్న వివిధ రకాల వ్యసనాలు, వాటి ప్రతికూల ప్రభావాలు, భావోద్వేగ మేధస్సు ప్రాధాన్యం, నేటి వేగవంతమైన జీవన విధానంలో మానసిక ఆరోగ్య పరిరక్షణ అవసరాన్ని విద్యార్థులకు చైతన్యపరిచారు. ప్రఖ్యాత సైకియాట్రిస్ట్ డాక్టర్ కిషోర్ తన అనుభవాలను, నిపుణుల సూచనలను పంచుకోగా, అనంతరం విద్యార్థులతో వ్యక్తిగత కౌన్సిలింగ్ సెషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వై యంగ్ ఇండియన్స్ తిరుపతి చాప్టర్ చైర్ వర్ష కస్తూరి, విశ్వస్ విశ్వనాథ్, వైష్ణవి మండలం, నితిన్ డి, డాక్టర్ శివరామకృష్ణ రెడ్డి, డాక్టర్ గౌరి నందిని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులారా అభివృద్ధి ఆటంకులుగా మారకండి



**చంద్రగిరి - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** వైసీపీ నాయకులు యంయల్ఏ పులివర్తి నానిని విమర్శించే ముందు ఒకసారి ఆలోచించండని చంద్రగిరి వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కుంభ నాగరాజు అన్నారు. వైసీపీ నాయకులు ఎమ్మెల్యే నానిని గురించి ఆవాకులు చవాకులు పే పేలుతుండటం పైన ఆయన మీడియా ముందు వైసిపి నాయకుల పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రగిరి నియోజకవర్గంలో 2024 లో జరిగిన ఎన్నికల్లో మా నాయకుడు పులివర్తి నాని 40 వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించి, ఎమ్మెల్యేగా ఎన్నికైన విషయం వైసిపి వారు గుర్తుపెట్టు కోవాలన్నారు. పులివర్తి నాని ఎమ్మెల్యే అయినా రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపైనే దృష్టి సారించారని తెలియజేశారు. ఆయన ఇప్పటివరకు ఏ ఒక్క కార్యకర్తపైన కూడా కక్ష సాధింపు చర్యలకు పాల్పడలేదన్నది వాస్తవమన్నారు. గ్రామాల్లో రెచ్చగొట్టే రాజకీయాలు చేయలేదని, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని పోతున్నారని చెప్పారు. నాని సౌమ్యమైన స్వభావం, నిబద్ధతను మీరు ఆయన బలహీనతలక భావిస్తే సమస్యలు కొని తెచ్చుకుంటారని వివరించారు. పార్టీలకతీతంగా అందరం కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. దయచేసి మీరు ఆయనతో కలిసి పనిచేయకపోయినా పరవాలేదు కానీ నియోజకవర్గ అభివృద్ధిని మాత్రం అడ్డుకోవద్దని హితవు పలికారు. విద్వేషాలు రెచ్చగొట్టి ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్టొద్దని, ప్రజలందరి సంక్షేమం కోసం పని చేయడానికి సహకరించండని విజ్ఞప్తి చేశారు.

## సీఎం చంద్రబాబుకు నాయీ బ్రాహ్మణులు రుణపడి ఉంటాం

**- ఉచిత విద్యుత్ ఆమోదం హర్షనీయం**

**- నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం**



**తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** నాయీ బ్రాహ్మణులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు రుణపడి ఉంటామని రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తెలిపారు. బుధువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో నాయి బ్రాహ్మణులకు 150 నుంచి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు ఆమోదం తెలపడం హర్షనీయమని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న కలను సాకారం చేసిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. దేవాలయాల లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణుల జీతాలు 20 నుంచి 25వేల రూపాయలకు పెంచడం, అదేవిధంగా పాలకమండళ్ల లో నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పిస్తామని ప్రకటించడం గొప్ప విషయం అన్నారు. గత ప్రభుత్వాలు ఏమాత్రం నాయి బ్రాహ్మణులను పట్టించు కోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ నాయీ బ్రాహ్మణులకు పెద్దపీట వేసిందని, బీసీల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందని అన్నారు. రాష్ట్ర నాయి బ్రాహ్మణుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## చౌక దుకాణాలలో కొలతలతో సరుకులు అందించాలి



**చంద్రగిరి - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** చౌక దుకాణాలలో కార్డుదారులకు సరుకులను ఖచ్చితమైన కొలతలతో అందించాలని ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవీ గింజిమాల అన్నారు. చంద్రగిరి మండలంలోని తొండవాడ గ్రామంలోని 1028010 నెంబరు రేషన్ దుకాణంను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక, వైసిపి పాలన నాటి ఎం.డి.యూ వాహనాలను నిలిపివేసి, తిరిగి రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఆమె దుకాణంలో రేషన్ పంపిణీ విధానాన్ని, కార్డుదారులకు అందుతున్న సరుకుల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అక్కడున్న కార్డుదారులను నేరుగా పంపిణీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. డీలర్ చక్కెర కోసం ఎంత డబ్బులు తీసుకుంటున్నారని అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. దేవి గింజిమాల స్వయంగా కార్డుదారులకు బియ్యం, చక్కెరను పంపిణీ చేశారు. ప్రతి నెలా 1 వ తేదీ నుంచి 15 వ తేదీలోపు కచ్చితంగా సరుకులు పంపిణీ చేయాలని అధికారుల ను ఆదేశించారు. రేషన్ డీలర్లపై ఏవైనా ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషచల రాజు, సి.ఎస్.డి.టి సురేంద్ర, గోడౌన్ డిటి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి తుంగవాళికల విరాళం



**తిరుపతి రూరల్ - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారికి కెనడాకు చెందిన దాత రమణారావు బుధవారం ప్రత్యేకంగా రెండు వెండి తుంగవాళికలను విరాళంగా అందజేశారు. సుమారు 4.144 కిలోల వెండితో తయారైన ఈ తుంగవాళికల విలువ రూ. 6 లక్షల వరకు ఉంటుందని ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈవో దేవరాజులు, ఇన్స్పెక్టర్ సుబ్బరాయుడు, అర్చకులు బాబు స్వామిల సమక్షంలో దాత విరాళాన్ని ఆలయానికి అప్పగించారు. తర్వాత దాత రమణారావు కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించి, అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

**- అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి వెల్లడి - హార్సిలీహిల్స్‌లో పలు సుందరీకరణ పనులు ప్రారంభం**


**- ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగిస్తే కఠిన చర్యలు**





**బి.కొత్తకోట - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** పర్యాటక రంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఆంధ్ర ఊటీ, పేదల ఊటీగా ప్రసిద్ధిగాంచిన హార్సిలీహిల్స్ నందు పలు సుందరీకరణ పనులను చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు.బుధవారం బి.కొత్తకోట పరిధిలోని ఆంధ్ర ఊటీగా పిలువబడి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ లో పలు సుందరీకరణ పనులలో భాగంగా వెల్కమ్ టు హార్సిలీ హిల్స్ బోర్డును, హరిత హెూటల్ ఎదురుగా ఉన్నటువంటి కూడలిలో వాటర్ ఫౌంటెన్ ను, రెవెన్యూ శాఖ సహకారంతో హెూటల్ బ్రీజోరా కలెక్టర్ ప్రారంభోత్సవం చేసి వినాయక స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్ లోని ప్రధాన కూడళ్లలోని పలు సుందరీకరణ చేసిన పనులను పరిశీలించారు. హార్సిలీహిల్స్‌లో పర్యాటకులను ఆకర్షించేందుకు వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. హార్సిలీహిల్స్ పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుద్ధ్య పనులకు సంబంధించి ఏజెన్సీల ద్వారా కొత్తగా పారిశుద్ధ్య కార్మికులను త్వరలో ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సెక్యూరిటీ గార్డులను నియమించడం జరుగుతుందని, అలాగే పర్యాటక కేంద్రం నందు మద్యం,మత్తు పదార్థాలు సేవించి, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయడం పర్యాటకులకు ఇబ్బందులు కలగచేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. పర్యాటకులకు భద్రత కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. పర్యాటకుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పర్యటనలో గాలిబండ వద్ద ఏర్పాటు చేసిన ఐ లవ్ యు హార్సిలీహిల్స్ బోర్డు ఏర్పాటును, హార్సిలీహిల్స్‌లో ఏర్పాటు చేసిన స్తూపాన్ని ఆధునీకరణ పనులను, జిడ్డు కృష్ణమూర్తి కూడలి, వివేకానంద విగ్రహాలకు ఏర్పాటు చేసిన గ్రిల్స్ ను పరిశీలించారు.అనంతరం అధికారులకు పర్యాటకులను ఆకర్షించేందుకు, పర్యాటక కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరుతోపాటు తహసిల్దార్ బావా జాన్, ఎంపీడీవో కృష్ణవేణి, రెవెన్యూ, పర్యాటక సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## ఎంబీయూలో నూతనంగా
# ప్రవేశం పొందిన విద్యార్థులకు స్వాగతం






**చంద్రగిరి - ఆంధ్రనాడు, ఆగష్టు 6:** చంద్రగిరి మండలం ఏ రంగంపేట సమీపంలోని సాయినాథ్ నగర్ ఉన్న ఎంబియులో 2025 – 26 విద్యా సంవత్సరానికి నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు స్వాగతం పలుకుతున్నామని ఛాన్సర్ డాక్టర్ ఎం. మోహన్ బాబు, ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. కొత్త విద్యార్థులను స్వాగతించడానికి మోహన్ బాబు విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో ఫ్రెష్‌మెన్ ఇండక్షన్ ప్రోగ్రామ్ 2025ను నిర్వహించింది. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి వైస్–ఛాన్సలర్ డాక్టర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి,మోహన్ బాబు విశ్వవిద్యాలయం తమ కెరీర్‌కు ఎంబియును ఎంచుకున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు.ఫ్రెష్‌మెన్ డీన్ డాక్టర్ ఎన్. గిరీష్ విద్యార్థులు మరియు తల్లిదండ్రులను పలకరిస్తూ, ఎంబి విశ్వవిద్యాలయాన్ని ఎంచుకున్నందుకు బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని నొక్కి చెప్పారు.ఇంటర్ డిసిప్లినరీ లెర్నింగ్‌ను అనుమతించే ఫ్లెక్సిబుల్ ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ గురించి డీన్ అకాడెమిక్స్ డాక్టర్ పి. వెంకట్ రమణ విద్యార్థుల ప్రయోజనాలను వివరించారు.వివిధ బహుళజాతి కంపెనీల లో సంవత్సరానికి 4 లక్షల నుండి 60 లక్షల ప్యాకేజీలతో పనిచేస్తున్న పాత విద్యార్థుల గురించి డాక్టర్ డిల్లీ బాబు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. శిక్షణా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని, కోడింగ్ మరియు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, వ్యక్తిత్వ వికాసంపై పనిచేయాలని, క్రమశిక్షణను కాపాడుకోవాలని ఆయన ఫ్రెషర్లకు సూచించారు. కెరీర్ విజయాన్ని సాధించడానికి ఇవన్నీ చాలా కీలకమని ఆయన సూచించారు.చీఫ్ గ్రోత్ స్ట్రాటజీ ఆఫీసర్ శ్రీ వికాశ్ సింగ్, అమెరికా లోని పెన్ స్టేట్ యూనివర్శిటీతో మోహన్ బాబు విశ్వవిద్యాలయం యొక్క మార్గదర్శక జాయింట్ డిగ్రీ ప్రోగ్రామ్ మరియు ది హిందూతో భాగస్వామ్యంతో వినూత్నమైన స్టటప్ ఇంగ్లీష్ ప్రోగ్రామ్ గురించి మాట్లాడారు. ప్రీ–ప్లేస్‌మెంట్ శిక్షణ యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కిచెప్పారు. “బాగా ప్లాన్ చేసుకోండి, కష్టపడి చదవండి మరియు విజయం సాధించండని విద్యార్థులను కోరారు.ముఖ్య అతిథి డాక్టర్ లవణం అంబల్ల మాట్లాడుతూ ఏటా 15 లక్షల మంది ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ల పోటీ ఉద్యోగ మార్కెట్లో వ్యక్తిత్వ నిర్మాణం మరియు ఉపాధి సామర్థ్యం గురించి నొక్కి చెప్పారు. రిక్రూటర్‌గా తన విస్తృత అనుభవం నుండి, శ్రీ విద్యానికేతన్ ఇంజనీరింగ్ కళాశాల నుండి 5000 మందికి పైగా విద్యార్థులు గత 15 సంవత్సరాలలో నియమించబడ్డారని పేర్కొన్నారు. పరిశ్రమ అంచనాలను అందుకోవడానికి కృషి చేయాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.డాక్టర్ ఎం.బాలాజీ కృతజ్ఞతలు తెలుపుతూ, ఛాన్సలర్, ప్రో ఛాన్సలర్, వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ ఆఫీసర్, అన్ని ప్రముఖులకు వారి అమూల్యమైన సహకారానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో చురుకుగా పాల్గొన్నందుకు, మద్దతు ఇచ్చినందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు, డీన్‌లు, అధ్యాపకులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# అలరించిన అర్జున తపస్సు



**రామచంద్రాపురం - ఆంధ్రనాడు, ఆగష్టు 6:** రామచంద్రాపురం మండలం లోని ఎన్ఆర్ కమ్మపల్లి లో నిర్వహిస్తున్న 59వ మహాభారత వార్షికోత్సవాల సందర్భంగా

బుధవారం పాశుపతాత్ర సంపాదన కోసం అర్జునుడు చేపట్టిన ఘోర తపస్సు భక్తులను ఎంతగానో అలరించింది.తపస్సు సమయంలో అర్జున పాత్రధారి ఆలాపించిన శివ స్తోత్రాలు అందరిని ఆకట్టుకున్నాయి. పెద్దలు సూచించిన మేరకు ద్రౌపతి పంచ పాండవులలో ఒక్కొక్కరి దగ్గర ఒక సంవత్సరం ఉంటూ రావటం, ఎవరి దగ్గర అయితే ద్రౌపతి ఉంటుందో అందరి ఆయుధాలు ఆ ఇంటిలోనే ఉంచాలి.వారి అనుమతి లేనిదే ఆయుధాలను తీయకూడదు.అయితే ద్రౌపతి ధర్మరాజు ఇంటిలో ఉన్న సమయంలో ఒక బ్రాహ్మణుడి ఆవును పులి చంపడానికి రావడం,బ్రాహ్మణుడి అభ్యర్థన మేరకు అర్జునుడు ధర్మరాజు అనుమతి తీసుకోకుండా ఆయన ఇంటిలో నుంచి తన ఆయుధాన్ని తీసుకొని వచ్చి పులిని పారదోలాడు. దీనికి ప్రాయశ్చిత్తంగా తీర్థయాత్రలకు అర్జునుడు బయలుదేరాడు. పనిలో పనిగా ఆయుధ సంపాదనకు పూనుకున్నాడు ఇందులో భాగంగా ఇంద్రకీలాద్రి పర్వతంపై అర్జునుడు పాశుపతాస్త్రం కోసం తపస్సు చేయటం. ఆ సమయంలో శివుడు పార్వతీదేవితో చండాలు డి వేషం ధరించి ఇంద్రకీలాద్రి కి చేరటం అర్జునుడు తన బాణంతో ఓ వరాహాన్ని సంహరించటం అదే సమయంలో శివుడు కూడా అవరాహంపై బాణం వదలటం. మృతిచెందిన వరాహం తనదంటే తనదని అర్జునుడు కిరాతక రూపంలో ఉన్న శివుడు పొట్లాడటం శివుని చేతిలో అర్జునుడు మూర్చ నొందటం, అర్జునుడి వీపు పైన ఉన్న విజయానికి చిహ్నమైన వింజామరులను చూపమని కోరుతూ ఉండిన పార్వతీదేవికి శివుడు వింజామరలును చూపించటం వంటి సన్నివేశాలను నాటక పాత్రధారులు చక్కగా ప్రదర్శించి చూపారు.తపస్సు భాను చుట్టూ సంతానం లేని మహిళలు చన్నీటి స్నానమాచరించి తడి బట్టలతో వరపడ్డారు. తపసుకు జామకాయలు నిమ్మకాయలు అరటి పండ్లు వీపుది పండ్లు పూజలు నిర్వహించి ఉపయోగించారు వాటిని వరపడ్డవారికి వెదచల్లరు.అర్జున తపస్సు కార్యక్రమానికి తిరుపతికి చెందిన గాలి వేణుగోపాల్ నాయుడు ఆనందమ్మ కుటుంబ సభ్యులు పవన్ కుమార్ జీవన్ కుమార్ ఉభయదారులుగా వ్యవహరించారు. మూడు పూటలా ఎన్ ఆర్ కమ్మ పల్లి గ్రామానికి చెందిన దద్దాల శంకర్ నాయుడు కోమలమ్మ కుటుంబ సభ్యులు హనుమంత నాయుడు మాలతి భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు. ప్రధాన అర్చకులు హరి ఆచారి, అర్చకులు అరవింద్ ఆచారి,దివంగత అర్చకులు బ్రహ్మర్షి వెంకటరత్నమాచారి శిష్య బృందం ద్రౌపతి మాతకు పాండవులకు పరివార దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.హరికథ భాగవతారని జ్యో ష్ణా రాకయుక్తంగా హరికథ గానం చేశారు. రాత్రి శ్రీ వెంకటేశ్వర కళానాట్యమండలి వారు పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు. ధర్మకర్త రమేష్, గ్రామ పెద్దలు భక్తులకు ఎలాంటి సమస్యల తలత్తెకుండా చర్యలు చేపట్టారు.

## భక్తులకు
## ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయండి



**కార్వేటినగరం - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** కార్వేటి నగరంలోని కుమారగిరిపై వెలసిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ ఆడికృత్తిక ను ఈనెల 15, 16, 17 తేదీలలో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నగరి ఆర్డీవో అనుపమ బుధవారం ఆలయం ఆవరణలో మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడి కృత్తికకు వచ్చే భక్తులు ఎటువంటి అవాంఛనీయా ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. త్రాగునీరు, వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఇబ్బంది కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో తాహసిల్దార్ నాగరాజు, ఆలయ అధికారి కృష్ణ నాయక్, ఎస్ఐ మునికృష్ణ, ఈవో నాగరత్నమ్మ, మండల నాయకులు రాజశేఖర్, వాసుదేవరెడ్డి, రవి యాదవ్, రాజేందర్ రెడ్డి, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా తెప్పోత్సవం



**కార్వేటినగరం - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామి తెప్పోత్సవం వైభవంగా ప్రారంభమైయింది. సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువు దీర్చి పుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. స్కంద పుష్కరనీలో తెప్పపై సీతా కోదండ రాముల స్వామివారిని ప్రతిష్టించి మేళ, తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి సురేష్ కుమార్, సురేష్, వెంకట్ రెడ్డి, వేద పండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబ్ బాబుసురేష్, టీటీడీ సిబ్బంది, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## బీజేపీ తిరుపతి తూర్పు మండల నూతన అధ్యక్షుల నియామకం



**తిరుపతి ప్రెస్ క్లబ్ - ఆంధ్రనాడు, ఆగస్టు 6:** తిరుపతి భారతీయ జనతా పార్టీ తూర్పు మండలం నూతన అధ్యక్షుని ఎన్నిక స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో జరిగినది. అధ్యక్షుని గా ఆదం అనిల్ కుమార్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా వి వెంకటకృష్ణ, సతీష్‌కి మండల కమిటీ ఏర్పాటు త్వరలో పూర్తి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో రాబోవు 12 వ తేదీ నూతన రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ విచ్చేస్తున్న సందర్భంగా తిరుపతి రూరల్ మండలం నుండి బిజెపి కార్యకర్తలు ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముని సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధికార ప్రతినిధి టీటీడీ బోర్డు మెంబర్ భాను ప్రకాష్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మల కుప్పం శేఖర్, మాజీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ చంద్ర రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ నవీన్ రాయల్ ఈ కార్యక్రమంలో బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొలకవారిపల్లిలో తల్లిపాల వారోత్సవాలు




**కురబలకోట - ఆంధ్రనాడు, ఆగస్టు 06:** మండలం లో బుధవారం తంబల్లపల్లి ప్రాజెక్టు పరిధిలో కురబలకోట మండలము మొలకవారి పల్లి అంగన్వాడి కేంద్రం పరిధిలో తల్లిపాలు వారోత్సవాలు, శ్రీమంతాలు నిర్వహించడమైంది. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రు పాలుతాగించాలి ఇందులో ఇమ్యూనిటీ పవర్ బాగుంటుంది కొలెస్ట్రాల్ ఉంటుంది బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు మొదటి టీకాగా గుర్తించాలి కేవలం 6 నెలల వరకు బిడ్డకి పాలు ఇవ్వాలి ఆ తర్వాత అనుబంధ ఆహారంతోపాటు తల్లిపాలు ఇవ్వాలని అలా ఇవ్వడం వల్ల తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా నివారించవచ్చు నని సిడిపిఓ సుజాత తెలియజేశారు. అందులో భాగంగా తల్లులకి సామూహిక శ్రీమంతాలు నిర్వహించడమైంది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకాంత అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీ పల్లికొండేశ్వర స్వామి
## దేవస్థానంలో ప్రదోష పూజలు



**నాగలాపురం – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో వెలిసి ఉన్న శ్రీ సర్వమంగళ సమేత శ్రీ పల్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో ప్రదోష పూజలు నిర్వహించారు. ప్రదోషం సందర్భంగా శ్రీ నందీశ్వర స్వామి, శ్రీ వాల్మీకేశ్వర స్వామి వారికి ఏకకాలంలో ప్రదోష పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అభిషేకం అనంతరం స్వామి అమ్మవార్లను, ప్రదోష నందీశ్వర స్వామి వారిని వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించి ధూప దీప నైవేద్యములు, మహాదీపారాధనలు నిర్వహించారు. ఈ ప్రదోష పూజలకు ప్రసాదం ఉభయదారులుగా నింద్రకు చెందిన శ్రీనివాస్ మిల్క్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఉభయ దారులుగా వ్యవహారించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారిణి పి.లత ఆలయ మర్యాదలతో దర్శనం ఏర్పాట్లు చేసి స్వామి వారి ప్రసాదములు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఉద్రిక్తతకు దారితీసిన బసు షెల్టర్ కూల్చివేత



**చంద్రగిరి – ఆంధ్రనాడు, ఆగష్టు 6:** చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలోని బస్ షెల్టర్ కూల్చివేత ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ఇలా ఉన్నాయి. గతంలో పాతబడిన బస్ షెల్టర్ ను గ్రామానికి చెందిన ఓ దాత పున:నిర్మించాడు. ప్రైవేట్ వెంచర్‌కు అడ్డుగా ఉందని బస్ షెల్టర్ తొలగించినట్లు గ్రామస్తులు ఆరోపణలు చేస్తున్నారు. రాత్రి సమయాలలో కూల్చివేయడం పై విమర్శలు. వెల్లువెత్తుతున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఉన్న బస్సు షెల్టర్ ను తొలగించడంపై గ్రామస్తుల ఆవేదన చెందుతున్నారు. కూల్చివేసిన వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు



**కృష్ణసముద్రం – ఆంధ్రనాడు, ఆగష్టు 6:** కృష్ణసముద్రం సచివాలయంలోని ఎగువ కృష్ణ సముద్రం అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం అనిత మాట్లాడుతూ గర్భవతులకు బాలింతలకు తల్లిపాల యొక్క ఆవశ్యకత గురించి వివరించడం జరిగినది. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలు పట్టించాలని, ముర్రుపాలలో, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని. బిడ్డకు ఆరు నెలల వరకుకేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారుహెల్త్ అసిస్టెంట్ పెన్ మల్లీశ్వరి, అంగన్వాడి వర్కర్ శాంతి దేశమ్మఆశ వర్కర్ రాణి పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్ల తొలగింపు



**రేణిగుంట – ఆంధ్రనాడు, ఆగస్టు 6:** రేణిగుంట క్యారేజి రిపేర్ వర్క్ షాప్ (సి ఆర్ ఎస్) రహదారిలో రేణిగుంట అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో మద్యం బాటిల్లు, ప్లాస్టిక్ వ్యర్ధాలను బుధవారం తొలగించారు. రేణిగుంట అర్బన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జయ చంద్ర, సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్స్పెక్టర్ స్వాతి ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రేణిగుంట పట్టణంలో తిరిగి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రజలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ద్విచక్ర వాహనాలు రోడ్డుపక్క పార్కింగ్ ప్లేస్ లో నిలపాలని హెచ్చరించారు. పట్టణంలోని ప్రధాన కూడలిలో పరిశీలించారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అలవర్చుకోవాలి



**కార్వేటినగరం – ఆంధ్రనాడు, ఆగస్టు 6:** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ విద్యాసంస్థల్లో జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని, క్రమశిక్షణతోనే ఉన్నత విద్యా లక్ష్యాలు నెరవేర్చుకోవచ్చని తెలిపారు. ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని డైరెక్టర్ దిలీప్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ వెంకటేష్, పురుషోత్తం ప్రిన్సిపాల్ కిషోర్, వైస్ ప్రిన్సిపాల్ దుర్గాభవాని, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

### స్వయం సహాయక సంఘాలకు
# రుణాలు మంజూరు చేయాలి

**- బ్యాంకర్లు విద్యా రుణాలను సకాలంలో మంజూరు చేయాలి - జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్**




**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం డిజిటల్ (ఎంసిపి) ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు (డిసిసి)జిల్లా స్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం జాయింట్ కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ సామంచి శర్మ , ఎల్డీఎం గుంటూరు రవికుమార్ లతో కలిసి డిసిసి / డిఎల్ఆర్సి సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం డిజిటల్ ఎంసిపి ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. విద్యా హబ్ అయినా తిరుపతి జిల్లాలో పలు విశ్వవిద్యాలయాలు ఉన్నాయని, విద్యకు సంబంధించిన రుణాల విషయంలో ప్రత్యేక ప్రాధాన్యతవిస్తూ రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. పిఎంఈజిపి పథకం రుణాలు మంజూరైన యూనిట్లు అన్ని గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్టాండప్ ఇండియా రుణాలను బ్రాంచ్ ల వారీగా లక్ష్యాలను అందిపుచ్చుకోవాలని ఆయాపథకాల లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. కొన్ని ప్రైవేటు బ్యాంకులు రుణాల మంజూరు విషయంలో వెనకబడి ఉన్నాయని ఎలాంటి జాప్యం చేయకుండా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకర్లందరూ రుణాల మంజూరు లో నిర్దేశించబడిన లక్ష్యాలను అందిపుచ్చు కోవాలని సూచించారు. జిల్లాలో వర్షాలు అధికంగా పడే అవకాశం ఉన్నందు వలన క్రాప్ లోన్ సంబంధించిన రుణాల విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కౌలురైతు కార్డుదారులకు క్రాప్ లోన్ కి సంబంధించిన రుణాలను బ్యాంకర్లు సకాలంలో మంజూరు చేయాలనీ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి రుణాలను సకాలంలో మంజూరు చేయాలని తెలిపారు. రైతులకు క్రాఫ్ లోను మంజూరు చేసేటప్పుడు పంటలకు ఇన్సూరెన్స్ చేయించాల్సిన బాధ్యత బ్యాంకు వారిదేనని తెలిపారు. ఇన్సూరెన్స్ పై అవగాహన లేని వారికి అవగాహన కల్పించి వారి చేత ఇన్సూరెన్స్ కట్టించాలన్నారు. జిల్లాలో ఫైనాన్సియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా డిజిటల్ లావాదేవీల పై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రత్యేక శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి శోభన్ బాబు, వ్యవసాయ శాఖ పిడి ప్రసాదరావు, మార్కెటింగ్ అధికారి సురేంద్ర బాబు,బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## ఉన్నత విద్యాభ్యాసంతో ఉన్నత లక్ష్యాలు సాధ్యం



**సత్యవేడు – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యాభ్యాసంలో ముందుకు సాగాలని సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి కోరారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి అధ్యక్షతన ప్రెసర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదవగలిగితే భవిష్యత్తు బంగారు బాట అవుతుందన్నారు. అయితే విద్యాభివృద్ధిలో అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే నిరంతర శ్రమ, పట్టుదల అవసరమన్నారు. ప్రధానంగా ప్రతిరోజు అధ్యాపకులు బోధిస్తున్న పాఠాలను శ్రద్ధగా విని ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రధానంగా సీనియర్ విద్యార్థులను స్ఫూర్తిదాయకంగా తీసుకొని వారి అడుగుజాడల్లో జూనియర్ విద్యార్థులు నడవాలన్నారు. ఎవరైతే క్రమశిక్షణతో విద్యఅభ్యసిస్తారో వారు ఉత్తమ ఫలితాలు సాధించడం ఖాయమన్నారు. తాను కళాశాల ప్రిన్సిపాల్గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టడం జరిగిందని, ఇందులో భాగంగానే దాతల సహాయంతో కళాశాలకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో కళాశాల ఆడిటోరియం షెడ్డుకు చుట్టూ పిట్టగోడ నిర్మించి అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. తదనంతరం క్రికెట్, వాలీబాల్, మ్యూజికల్ చైర్, కబాడీ, తదితర పోటీల్లో గెలుపొందిన 56 మంది విద్యార్థులకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్టేట్ జనరల్ సెక్రెటరీ రవితో కలిసి ప్రిన్సిపాల్ వెంకటరామరెడ్డి బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం ప్రసర్స్ డే ను పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగింది. విద్యార్థులందరూ సాంస్కృతిక కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని ఆనందించారు. ఈ క్రమంలో జేఎల్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ రవికి అధ్యాపక బృందంతో కలిసి ప్రిన్సిపాల్ వెంకటరామిరెడ్డి సాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు అనిల్ కుమార్, రాజేష్, సురేష్, సలీం అమీన్, దస్తగిరి, సుధీర్, గీత, కృష్ణవేణి, శివరాం, సుబ్రహ్మణ్యం, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## శాలివాహన కులస్తుల అభివృద్ధికి కృషి చేస్తా

**- రాష్ట్ర శాలివాహన (కుమ్మరి) కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్**



**బంగారుపాళ్యం – ఆంధ్రనాడు, ఆగష్టు 6:** ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర శాలివాహన (కుమ్మరి) కార్పొరేషన్ చైర్మన్ ఈశ్వర్ ను మండల శాలివాహన (కుమ్మరి) కులస్తులు మొగిలిలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనను శాలివాహన కుల సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన జికెజి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాకు శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడానికి కారణం అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఇతర మంత్రులు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా మొగిలికి రావడం జరిగిందని కుమ్మరి వృత్తి మానవుల జీవన విధానంలో ముడిపడి ఉందని పుట్టుక నుండి చావు వరకు మనిషి జీవితంతో కుమ్మరి వారు మట్టిని నమ్ముకుని మట్టితో తయారు చేసిన వస్తువుల తయారు చేయడం వల్ల బ్రతుకుతున్నారని జిల్లాలో శాలివాహన కులస్తుల వృత్తి సంబంధమైన సమస్యలు తెలుకోవడానికి వచ్చానని వాటిని ప్రభుత్వ దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కుమ్మరి కులస్తులు అందరూ కలిసి కట్టుగా ఉండి సమస్యలపై పోరాడాలని నావంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కుమ్మరి (శాలివాహన) సంఘం అధ్యక్షుడు చలపతి, జీ కే సీ కల్యాణ మండపం హరి, గుణశేఖర్, వెంకటాద్రి, గిరిబాబు, రవి, పూర్ణ, ఎన్ ఎస్ టి వి జిల్లా ఇంచార్జ్ బాలాజీ, పాండు, టైలర్ చంద్ర, రాణి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు నేర్పాలి



**చంద్రగిరి – ఆంధ్రనాడు, ఆగష్టు 6:** పాఠశాలలను విద్యార్థులకు విద్యుత్ తో పాటు క్రీడలు కూడా నేర్పాలని తిరుపతి జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌరీ శంకర్ అన్నారు. చంద్రగిరి మండలంలోని శ్రీ పద్మావతి బాలికలు ఉన్నత పాఠశాలలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భవిత పాఠశాలను, పీఎం శ్రీ పాఠశాలలోని సదుపాయాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. కిచెన్ గార్డెన్ అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసివున్న సెటిల్ బ్యాట్మెంట్ కాంక్రీట్ కోర్టు, హై జంప్ లాంగ్ జంప్ బిట్ ట్రాక్, వాలీబాల్ కోర్టు, టెన్నిస్ కోర్టు,త్రో బాల్ కోర్టు, ఆటలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలను బాగా అందంగా తీర్చిదిద్దాల ని కోరారు. అనంతరం విద్యార్థులకు అందించినటువంటి విద్యార్థి మిత్ర కిట్లకు సంబంధించిన నాణ్యతను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో నిర్వహిస్తున్న డిజిటల్ తరగతులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ రాబోవు పబ్లిక్ పరీక్షలందు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రతి ఒక్కరు కష్టపడి చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అధికారులు సుధాకర్ నాయుడు, చంద్రశేఖర్ నాయుడు చంద్రగిరి మండల విద్యాశాఖ అధికారిణి ఎస్ లలిత కుమారి, ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అపోలో యూనివర్శిటీలో
# నూతన విద్యార్థులకు ఘన స్వాగతం

**చిత్తూరు – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** ది అపోలో యూనివర్శిటీ బుధవారం "అధ్యాయ్ 2025" పేరుతో నూతన విద్యార్థుల కోసం ప్రత్యేక ఇన్‌డక్షన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. విశ్వవిద్యాలయ ఉపకులపతి డా. హెచ్. వినోధ్ భట్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన డా. వినోధ్ భట్, ఉత్తమ విద్య, క్రమశిక్షణ, మానవీయ విలువల ప్రాముఖ్యతపై ప్రేరణాత్మకంగా ప్రసంగించారు. "విద్యార్థుల కలల్ని నెరవేర్చేందుకు అపోలో యూనివర్శిటీ ఒక ఆదర్శ వేదిక"గా నిలుస్తుందన్నారు. విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు దోహదపడే క్లబ్‌లు, ఇన్నోవేషన్ సెంటర్లు, సాఫ్ట్‌వేర్ డెవలెప్‌మెంట్ సెంటర్ మొదలైన ఎన్నో సౌకర్యాలను ఉపయోగించుకోవాలని సూచించారు. యూనివర్శిటీ స్థాపించిన అతితక్కువ కాలంలో ప్రపంచ ప్రఖ్యాత ఆంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొన్నామని, వాటిని విద్యార్థులు ఉపయోగించుకొని భవిష్యత్తుకు బాంగారుబాట వేసుకోవాలని కోరారు. అపోలో గ్రూప్ వ్యవస్థాపకుడు డా. ప్రతాప్ సి. రెడ్డి జీవితాన్ని విద్యార్థులకు పరిచయం చేస్తూ, తమ సొంత ప్రాంతానికి సేవలందించాలనే లక్ష్యంతో ఆయన ఎలా ఈ సంస్థను స్థాపించారో వివరించారు. "ఉత్తమ వసతులు, నిపుణులైన ఫ్యాకల్టీతో అపోలో యూనివర్శిటీ నాణ్యమైన విద్య



అందిస్తోంది" అని పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.పోతరాజు మాట్లాడుతూ... తల్లిదండ్రులు తరచూ విద్యార్థుల హాజరు, ప్రగతిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. విద్యాపరమైన అన్ని విషయాలలో యూనివర్శిటీ పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్లు, శాఖాధిపతులు, కోర్సు కోఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్శిటీ విద్యార్థుల విద్యా ప్రస్థానానికి అనుకూల వాతావరణం సృష్టించేందుకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ వ్యవస్థ, అకాడమిక్ విధానాలు, విద్యార్థి సేవలు, వివిధ క్లబ్‌లు, కమిటీలు, క్యాంపస్ జీవితం గురించి విద్యార్థులకు తెలియజేయనున్నారు. కార్యక్రమంలో సీఓఓ నరేష్‌కుమార్‌రెడ్డి, ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ సేతురామన్, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ డా. డి.జగదీశన్, హెల్త్ సైన్సెస్ డీన్ డా. కె.భాస్కర్ రెడ్డి, మేనేజ్‌మెంట్ డీన్ డా.రామయ్య ఇటుమల్ల, అకడెమిక్ డిప్యూటీ డైరెక్టర్ డా.వివేకానందన్ తదితరులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో సీఈవో
# కరుణాకర్ రెడ్డి సేవలకు దక్కిన ప్రతిఫలం

**- బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డుకి ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం - ఘనంగా సన్మానించిన టీడీపీ నాయకులు**

**మదనపల్లి – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** సహకార సొసైటీలో 2024 – 25 ఏడాదికి సంబంధించి రైతులకు ఉత్తమ సేవలు అందించిన మదనపల్లి సింగిల్ విండో సీఈవో కరుణాకర్ రెడ్డికి తగిన ప్రతిఫలం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డుకి ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం మదనపల్లి సింగిల్ విండో కార్యాలయంలో రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాక కార్యదర్శి రాటకొండ మధుబాబు, మదనపల్లి ఆర్టీసీ డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూర్ వలి షో ఆప్ శీనా, రాటకొండ సోమశేఖర్, రాజంపేట పార్లమెంట్ కార్యాలయ కార్యదర్శి పూల మురళి, పెరవలి మధు, నాగేంద్ర, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సహకార సొసైటీ ద్వారా రైతుల సంక్షేమానికి సీఈఓ కరుణాకర్ రెడ్డి విశేషమైన కృషి చేస్తున్నారన్నారు. సొసైటీ ద్వారా రైతులకు విరివిగా సబ్సిడీ రుణాలు అందించడంలో ఆయన ప్రత్యేక చొరవ చూపుతున్నారని కొనియాడారు. బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డుకు ఆయనను ఎంపిక



చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని అవార్డులు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ అంకితభావంతో విధులు నిర్వహించి, రైతులకు నిస్వార్ధమైన సేవలు అందించానన్నారు. మనం చేసే పనిలో నిబద్ధత, నిజాయితీ ఉంటే అవార్డులు వాటంతటవే వరిస్తాయని స్పష్టం చేశారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, రైతులకు ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా తనను సన్మానించిన టిడిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు.

# వెలుగు సంస్థలో ఉచిత వైద్యశిబిరం

**- చిన్నారులు, వృద్ధులకు వైద్యపరీక్షలు**


**మదనపల్లి – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** పట్టణంలోని అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థలో ప్రభుత్వ సహకారంతో, మెడికల్ ఆఫీసర్ దివ్య 104 ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అందులో భాగంగా వెలుగు చిన్నారులకు మరియు వృద్దులకు ఉచిత వైద్య సేవలను అందించారు.ఈ క్యాంపు ద్వారా వెలుగు చిన్నారులకు, వృద్దులకు రక్త పరీక్షలు,షుగర్,బీపీ పరీక్షలు, సాధారణ పరీక్షలు చేసి వారికీ అవసరమైన సలహాలను, సూచనలు తెలియజేసి మందులను అందజేశారు. రాయచోటి



అన్నమయ్య జిల్లాల డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.లోకనాథం విచ్చే ఎన్టీఆర్ వైద్య సేవ వారు 70 సంవత్సరాలు పైబడిన వృద్దులకు ఆయుష్మాన్ భవ కార్డు ద్వారా రేషన్ కార్డు ఉన్న వారికి దాదాపు 250 వ్యాధులకు 5 నుండి 10 లక్షల వరకు ఆరోగ్య ఇన్సూరెన్స్ చికిత్స అందుతుందని తెలిపారు. క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు బెంగుళూరు, చెన్నైలో గల హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం సిఫారస్ చేస్తామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ డిస్ట్రిక్ట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.లోకనాథం, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివ్య, డీఈఓ ఉషారాణి, ప్రవీణ్ 104 ఆపరేషన్ ఎగ్జిక్యూటర్, సాయి గణేష్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఆశా వర్కర్లు, వెలుగు కార్యదర్శి ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి, వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్దులు పాల్గొన్నారు.

## వైభవంగా చింతలమునిస్వామి, నల్లారెడ్డి రథోత్సవం

**కర్నూలు, ఆదోని – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** కర్నూలు జిల్లా ఆదోని డివిజన్ లోని పెసల బండ గ్రామంలో శ్రీ చింతల మునిస్వామి, శ్రీ నల్లారెడ్డి స్వామి రథోత్సవం భక్తుల మధ్య లాగడం జరిగింది. అలాగే దేవాలయం కొండపై గోపురం, కళశ స్థాపన పెసల బండ గ్రామంలో ఉన్న ప్రజలు చేయించడం జరిగింది. అయితే శ్రావణమాసం శ్రీ చింతన ములుస్వామి, శ్రీ నల్లారెడ్డి స్వాముల 126 వ వార్షికోత్సవము చేయడం జరిగింది. అలాగే గౌలిగొట్టు గుహయంలో పరబ్రహ్మ పరంజ్యోతియై వెలసి వెలుగుచున్న శ్రీ చింతలమునిస్వామి, శ్రీనల్లారెడ్డి స్వాముల వారి దశమి మహోత్సవము" స్వస్తశ్రీ విశ్వావసునామ శ్రావణ మాసం రాత్రి 8 నుండి పెసలబండ శ్రీ ఈశ్వర ఆంజనేయస్వామి దేవాలయం నుండి గ్రామ పురవీధుల గుండా శ్రీ చింతలమునిస్వామి, శ్రీ నల్లారెడ్డి స్వాముల గౌలిగొట్టు గుహ





గ్రామంలో ఉన్న ప్రజలు దేవాలయం వరకు రోడ్డు సౌకర్యం సక్రమంగా లేదని రోడ్డు వేయించాలని టిడిపి కృష్ణ మన కోరడం జరిగింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రోడ్డు వేయించేందుకు కృషి చేస్తానని, నా వంతు సహాయ చేస్తానని ఆమె చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పెసల బండ

వరకు అఖండ వైభవముతో బాజ భజంత్రీలతో "పల్లకి సేవా, అశ్వము ఊరేగింపు" కార్యక్రమము చేయడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి ఆది కృష్ణమ్మ పెసల బండ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ చింతల మునిస్వామిని,,శ్రీ నల్ల రెడ్డి స్వామిని దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెసల బండ గ్రామం గృహాలు వెలసిన స్వాములను దర్శించుకోవడం నా జన్మ ధన్యమైందని ఇదే మొదటిసారి రావడం అని ఆమె చెప్పారు. పెసల బండ గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను ప్రశాంతంగా జరుపుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని సర్పంచ్ నరసింహ గౌడ్ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ చింతల మునిస్వామి దేవాలయంకు దాతలు ఎవరైనా అంటే నేరుగా దేవాలయాన్ని అభివృద్ధి చేయాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పెసలబండ కృష్ణ, పురుషోత్తం, పూజారి కృష్ణ వీరభద్ర రెడ్డి రాజశేఖర్, ప్రతాపరెడ్డి, సిద్దు పెసల బండ గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాల్లో
# భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడండి


**- కమిషనర్ ఎన్.మౌర్య**



**తిరుపతి – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** నగరంలోని ఖాళీ స్థలాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని అన్నారావు కూడలి, కె.టి.రోడ్డు, తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు, ప్రజల నుండి వచ్చిన వినతులను హెల్త్, ఇంజినీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. పలు చోట్ల భవనాల వ్యర్థాలు ఉండడం, మురుగునీటి కాలువల్లో చెత్త ఉండడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. నగరంలో ఎక్కడైనా భవన నిర్మాణ వ్యర్థాలు ఉంటే వెంటనే వాటిని తూకివాకం ప్లాంట్ కు తరలించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన వినతులను అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. అనుసంధాన మార్గాల్లోని రోడ్లలో కూడా గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని అన్నారు. ఎవరైనా రోడ్లపై వేస్తే జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, డి.ఈ.లు మధు, వెంకట ప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.

## సుపరిపాలనకు కేరాఫ్ చంద్రబాబు

**కర్నూలు, ఆదోని – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** గత ప్రభుత్వంతో అంద కారంలో వెళ్ళిన రాష్ట్రాన్ని కూటమి నేతృత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలనకు కేరాఫ్ గా నిలిచాడని టిడిపి ఎ పి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి, గుంతకల్లు మైనారిటీ పరిశీలకుడు గడ్డా ఫక్రుద్దీన్ అన్నారు. బుదవారం రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాలకు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ, ఇవ్వని హామీలను అమలు చేస్తూ ప్రజల చేత మన్ననలు పొందుతున్న ముఖ్యమంత్రికి



కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంటింటా సుపరిపాలన పేరిట గడప గడప కు తిరిగి సమస్యలను తెలుసుకోవడం జరిగిందన్నారు. మంత్రి వర్గంలో తీసుకున్న 9 అంశాలలో బ్రిటిష్ వారి నుండి స్వేచ్ఛ వాయువు పీల్చిన రోజు నుండి రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం అమలు, సత్ప్రవర్తన కలిగి ఉండడంతో 17 మంది జీవిత ఖైదీలకు విముక్తి, రాష్ట్ర వ్యాప్తంగా 2048 ఎస్పీఎఫ్ పోలీసు లకు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి, ఆటో డ్రైవర్ల తో సమావేశం ఏర్పాటు లాంటి సాహొసపేతమైన నిర్ణయాలు తీసుకున్న పరిపాలనాధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అని కొనియాడారు.

## విశ్వం హైస్కూల్లో ఘనంగా గ్రీన్ డే



**తిరుపతి – ఆంధ్రనాడు, ఆగష్టు 6:** ప్రకృతిని ప్రేమించండి – పచ్చదనాన్ని ప్రోత్సహించండి అనే ఉద్దేశంతో విశ్వం హైస్కూల్, జీవకోనలో బుధవారం ఘనంగా గ్రీన్ డే జరుపుకున్నారు. విద్యార్థులు అందరూ పచ్చని వస్త్రధారణలో తళుక్కున మెరిశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే గృహోపయోగ వస్తువులతో చేసిన ఆకర్షణీయమైన హ్యాండ్‌క్రాఫ్ట్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చెట్ల ప్రాముఖ్యతపై పాటలు, నాటికలు, స్వయంగా పెంచిన మొక్కల ప్రదర్శన వంటి అనేక సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పచ్చదనం వల్ల ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు వివరించారు. విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ "పిల్లల్లో చిన్ననాటి నుంచే పర్యావరణ స్నేహపూర్వక దృక్పథాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం గ్రీన్ డే జరుపుకుంటున్నాం" అని పేర్కొన్నారు. పిల్లలు మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు ప్రాముఖ్యత ఇవ్వడం ద్వారా భవిష్యత్తులో పచ్చదనం పరిరక్షణకు మార్గదర్శకులుగా మారతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పచ్చిరొట్ట ఎరువుల వాడకం భూమికి ఆరోగ్యం

**బి.ఎన్.కండ్రిగ – ఆంధ్రనాడు, ఆగష్టు 06:** మండలంలోని కాటూరు గ్రామంలో పీ.ఎం.ఆర్కే.వి.వై పథకం కింద తిరుపతి జిల్లా వనరుల కేంద్రం వారిచే రైతు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమములో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల




వాడకం భూమి ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా, నేల నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, దిగుబడిని కూడా పెంచుతుందని తెలియజేశారు .ఈ కార్యక్రమంలో బిఎన్ కండ్రిగ మండల వ్యవసాయ అధికారి షణ్ముగం మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ప్రస్తుతం అమలు చేస్తున్న వివిధ పథకాల, పంటల బీమా పథకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, లావణ్య, జిల్లా వనరుల కేంద్రం ఏఈఓ రవిప్రసాద్ వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733